Follow: @ANNTELUGU

04-12-2024

# మహా పత్రిక

ANN తెలుగు

బుధవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 03 పేజీలు-10 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM





## రియల్ రంగంలో హైదరాబాద్ నెం.1

బిల్డ్ నౌ యాప్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

భవనాలు, లే అవుట్లకు ఆన్ లైన్‌లో అనుమతులు

వివరాలు 3లో

మాస్

## నేనొస్తున్నా నరకం చూపిస్తా




- నేను బాధ్యతలు చేపట్టకముందే బందీలను విడుదల చేయాలి
- హమాస్‌కు డొనాల్డ్ ట్రంప్ బిగ్ వార్నింగ్

02

పాస్

## కాంగ్రెస్ ప్రభుత్వం పాసైంది




- ఏడాది పాలనకు 60 శాతం మార్కులు
- బీఆర్ఎస్‌తో పోలిస్తే 90 శాతం బెటర్ : కూనంనేని

02

మూవీస్

## మంగళగిరిలో వీరమల్లు



- ఇన్ స్టాలో పవన్ సెల్ఫీ
- 2025 మార్చి 28న మూవీ రిలీజ్

02

## పవన్‌కు అమిత్ షా ప్రశంసలు



- పవన్ కల్యాణ్‌ను క్రౌడ్‌పుల్లర్‌గా అభివర్ణించిన కేంద్రమంత్రి అమిత్ షా
- మహారాష్ట్రలో పవన్ ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో మహాయుతి అభ్యర్థుల గెలుపు
- తమ గెలుపులో పవన్ కల్యాణ్ భాగస్వామ్యమయ్యారన్న అమిత్ షా

వివరాలు 2లో

# వస్తా.. నీ వెనుక

## సీఎం రేవంత్‌తో తలసాని భేటీ

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు నేపథ్యంలో భేటీ ప్రాధాన్యత

కుటుంబంలో వేడుకకు ఆహ్వానించేందుకేనన్న తలసాని

పోచారంతో పలువురు ఎమ్మెల్యేల మంతనాలు

త్వరలో చేరిక.. సిద్ధంగా ఉన్నానంటూ సంకేతాలు

గ్రేటర్ హైదరాబాద్ నుండే.. టచ్‌లో ఏడుగురు

“త్వరలో తలసాని కాంగ్రెస్ లో చేరుతారన్న ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించిన సంకేతాలను సీఎం రేవంత్ రెడ్డితో భేటీ సందర్భంగా ఇచ్చారని సమాచారం. తాజాగా తలసాని కుటుంబసభ్యులకు చెందిన ఇథనాల్ ఫ్యాక్టరీని ప్రజలు వ్యతిరేకించిన నేపథ్యంలో ప్రభుత్వం రద్దు చేసింది. గొర్రెల కొనుగోళ్ళలో అక్రమాలకు సంబంధించి కూడా విచారణ జరుగుతోంది.

- మహా, హైదరాబాద్




వివరాలు 2లో

## హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్

కేసీఆర్ ఫ్యామిలీలో తొలిఫోన్ ట్యాపింగ్ కేసు




- పంజాగుట్ట పీఎస్‌లో కేసు నమోదు
- మాజీ డీసీపీ రాధాకిషన్ రావు పై కూడా
- రాష్ట్రంలో హాట్‌హాట్ చర్చ
- త్వరలో మరికొందరు పెద్దలపై కూడా..
- ఇటీవల ట్యాపింగ్ కేసులో మాజీ ఎమ్మెల్యేలను విచారించిన అధికారులు

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకు హాట్‌హాట్‌గా మారుతున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు రోజుకొకటి వెలుగుచూస్తుండటం ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ కీలక నేతలను పలు కేసులు చుట్టుముడుతున్నాయి. లేటెస్ట్‌గా మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రధానంగా వార్తల్లో నిలుస్తున్నారు. ఆయనపై పంజాగుట్ట పోలీసుస్టేషన్ లో కేసు నమోదు అయ్యింది. తనపై అక్రమ కేసులు పెట్టి వేధించారని చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మిగతా 2లో

“ లక్ష కేసులు పెట్టించినా,

### ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపను

అడుగడుగునా ప్రశ్నిస్తున్నందుకే.. తప్పుడు కేసులు

పంజాగుట్ట కేసుపై స్పందించిన మాజీమంత్రి హరీష్

తనపై లక్ష తప్పుడు కేసులు పెట్టించినా, ప్రజల పక్షాన ప్రశ్నించడం ఆపనని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ముఖ్యమంత్రి రెండు నాల్కల వైఖరిని బట్టబయలు చేసినందుకు, ప్రజాక్షేత్రంలో నిలదీసినందుకు తట్టుకోలేక పంజాగుట్ట స్టేషన్ లో మరో తప్పుడు కేసు పెట్టించాడని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో దేవుళ్లను సైతం దగా చేశారు అన్నందుకు యాదగిరి గుట్ట పోలీసు స్టేషన్ లో తప్పుడు కేసు పెట్టించారని, సోషల్ మీడియాలో ఎవరో పెట్టిన పోస్టుకు సైబర్ క్రైం పోలీసు స్టేషన్ లో తన మీద సంబంధం లేని కేసు పెట్టించారని, ఇపుడు మరో తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. ”

## దివ్యాంగులకు శుభవార్త

పెరగనున్న పెన్షన్

హామీ ఇచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్క

వివరాలు 2లో

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 77,780 |
| 22 క్యారెట్ | 71,300 |
| సిల్వర్ (కేజీ) | 91,000 |

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 80,845.75 |
| నిఫ్టీ ↗ | 24,457.15 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

**ఈరోజు గుడ్డు ధరలు**

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 6.15 | 184.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 6.15 | 184.5 |
| రిటైల్ గుడ్డు ధర | 6.52 | 195.57 |



## హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తాం

### న్యూయార్క్ టోక్యో లాగా తీర్చిదిద్దుతాం

రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెడితే హైదరాబాద్ అద్భుత నగరం

రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణకు మణిహారం

రూ.35వేల కోట్లతో నిర్మించి తీరుతాం

మా ప్రభుత్వం వచ్చాక రియల్ ఎస్టేట్ లో 29శాతం వృద్ధి

హైదరాబాద్‌కు కిషన్ రెడ్డి ఏం తెచ్చారు?

ఆయన మూసీలో పడి ఆత్మహత్య చేసుకున్నా ఎవరూ పట్టించుకోరు

బీజేపీ, బీఆర్ఎస్ నగర అభివృద్ధిపై మీ విధానం ఏంటో చెప్పండి

రైజింగ్ హైదరాబాద్ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

7వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**హైదరాబాద్, మహా:** గ్రేటర్ హైదరాబాద్ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. న్యూయార్క్, టోక్యో తరహాలో ప్రపంచంతో పోటీ పడేవిధంగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దుతున్నామన్నారు. నగరంలో మౌలిక వసతుల కల్పనకు 7వేల కోట్ల రూపాయలతో

మిగతా 2లో

## రంగంలోకి విద్యా కమిషన్

- మణుగూరు గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన ఆకునూరి మురళి
- ఆహారం నాణ్యత, విద్యావసతుల పరిశీలన



**మణుగూరు, డిసెంబర్ 3, మహా:** ఉపాధ్యాయులు, విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను సాధించే విధంగా బాటలు వెయ్యాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి అన్నారు. మంగళవారం అశ్వాపురం మండలం గొందిగూడెం గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, వసతి గృహం, మణుగూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల, అశోక్ నగర్ ఎంపీపీ పాఠశాలను ఆకస్మికంగా

మిగతా 2లో

## భారత అమ్ముల పొదిలోకి సరికొత్త అస్త్రం

- సైన్యం చేతికి నాగాస్త్ర డ్రోన్
- ఎనీటైం ఎటాక్

వివరాలు 2లో

## పార్లమెంటు ముందు ప్రతిపక్షాల ఆందోళన




- అదానీతోపాటు పలు అంశాలపై చర్చకు డిమాండ్
- టీఎంసీ, సమాజ్ వాదీ పార్టీలు గైర్హాజరు

వివరాలు 2లో

# వస్తా.. నీ వెనుక



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. ఉదయం బంజారాహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి తలసాని భేటీ అయ్యారు. తన సోదరుడి కుమార్తె వివాహానికి రావాలంటూ రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. పెళ్లి పత్రిక అందించి, చిరునవ్వులతో చేతులు కలిపారు. దీనికి సంబంధించిన ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. త్వరలో తలసాని కాంగ్రెస్ లో చేరుతారన్న ప్రచారం జరుగుతోంది. ఇందుకు సంబంధించిన సంకేతాలను భేటీ సందర్భంగా ఇచ్చారని సమాచారం. తాజాగా తలసాని కుటుంబసభ్యులకు చెందిన ఇథనాల్ ఫ్యాక్టరీని ప్రజలు వ్యతిరేకించిన నేపథ్యంలో ప్రభుత్వం రద్దు చేసింది. గొర్రెల కొనుగోళ్ళలో అక్రమాలకు సంబంధించి కూడా విచారణ జరుగుతోంది.

### గొర్రెల పంపిణీలో భారీ కుంభకోణం

చనిపోయిన వారికీ గొర్రెలను పంపిణీ చేసినట్లు నమోదు చేయడంతో పాటు.. నకిలీ రవాణా ఇన్వాయిస్‌లతో 68 కోట్లు స్వాహా చేశారని కాగ్ నివేదిక తేల్చింది. గొర్రెలకు నకిలీ ట్యాగ్‌లతో మరో 92 కోట్ల అవినీతి జరిగిందని, గొర్రెల పంపిణీలో 253.93 కోట్ల వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. గొర్రెల పంపిణీలో మొత్తం రూ.700కోట్ల కుంభకోణం జరిగినట్లు ఎసిబి తేల్చింది. తలసాని మాజీ ఓఎస్డీతో పాటు పలువురు అధికారులు ఇప్పటికే అరెస్ట్ అయ్యారు.

### గ్రేటర్ లో మూకుమ్మడిగా..

గ్రేటర్ కు చెందిన పలువురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరికలకు సుముఖత వ్యక్తం చేసినా ఇంకా ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. మూకుమ్మడిగా ఒకేసారి ఈ చేరికలు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. మాజీమంత్రి తలసాని తో పాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలు కూడా సంప్రదింపుల్లో ఉన్నారు. మొత్తం గ్రేటర్ కు సంబంధించి 7 గురు ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నట్లు తెలుస్తోంది.



## మహా లెక్కలు

**షిండేకు డిప్యూటీతో సరి**

**5న సీఎంగా ఫడ్నవిస్ ప్రమాణం**

**మహా:** మహా లెక్కలు తేలినట్లే కనిపిస్తోంది. ఈనెల 5న సీఎం, డిప్యూటీ సీఎంల ప్రమాణ స్వీకారం ఉంటుందని జాతీయ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. . కేబినెట్ కూర్పు ఇంకా పూర్తి కాని కారణంగా.. ఆ రోజు సీఎం, ఇద్దరు డిప్యూటీ సీఎంలు మాత్రమే ప్రమాణం చేస్తారని సదరు వర్గాలు తెలిపాయి. సీఎంగా ఫడ్నవీస్, డిప్యూటీ సీఎంలుగా ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ల ప్రమాణ స్వీకారం ఉంటుందని జాతీయ మీడియా పేర్కొంటోంది. మహారాష్ట్రలో కూడా షిండే ముందు వేరే మార్గాలు లేవన్న ప్రచారముంది.

# హరీశ్‌రావుపై ఎఫ్ఐఆర్

(మొదటిపేజీ తరువాయి)

కేవలం వేధింపులు మాత్రమే కాకుండా తన ఫోన్ ట్యాపింగ్ చేశారని ఫిర్యాదులో ప్రస్తావించాడు.



### పలు సెక్షన్ల కింద కేసు నమోదు

మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై పంజాగుట్ట పీఎస్‌లో కేసు నమోదయింది. సిద్దిపేటకు చెందిన చక్రధర్‌గౌడ్ అనే వ్యక్తి ఫిర్యాదుతో కేసు నమోదయింది. తన ఫోన్ ట్యాపింగ్ చేశారని, అక్రమ కేసులు పెట్టి వేధించారని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. దీంతో, హరీశ్‌పై సెక్షన్లు 120(బీ), 386, 409, 506, రెడ్ విత్ 34, ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. హరీశ్ తో పాటు అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ రావుపై కూడా కేసు నమోదయింది.

### తవ్విన కొద్దీ అక్రమాలే..

ఫోన్ ట్యాపింగ్ కేసులో తవ్విన కొద్దీ బీఆర్ఎస్ నేతల బాగోతాలు బయటపడుతున్నాయి. ఇదే కేసులో పలువురు అధికారులు అరెస్ట్ అయ్యారు. ఇప్పుడు హరీశ్‌రావుపై కేసు నమోదు కావడం హాట్ టాపిక్‌గా మారింది. ఇంకా చక్రధర్ గౌడ్ లాంటి బాధితులు ఎంత మంది ఉన్నారనేది తెలియాల్సివుంది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులపై అనేకసార్లు ఫిర్యాదు చేశారు చక్రధర్. గతంలో రైతులకు సంబంధించిన విషయంలో తాను చెక్ లు ఇచ్చానని, వారికి ఆదుకున్నానని గుర్తు చేశారాయన. ఆ సమయంలో తాను ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడమేకాకుండా కేసులు పెట్టి జైలుకి పంపిన విషయాన్ని గుర్తు చేశారు.

### త్వరలో నోటీసులు

**ఫోన్ ట్యాపింగ్ చేసి నా కదలికలను ఎప్పటికప్పుడు రాధాకిషన్ రావు గుర్తించి హరీష్‌రావుకు సమాచారం ఇచ్చేవారని అందులో పేర్కొన్నారు. హరీశ్‌రావు వల్లే తాను సర్వం కోల్పోయాలని బయటపెట్టాడు. ఈ అంశంలో చక్రధర్ నుంచి వివరాలు సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే రాధాకిషన్‌రావు జైలులో ఉండగా, రేపో మాపో హరీష్‌రావుకు నోటీసులు ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. కాగా మరికొందరు పెద్దలపై కూడా కేసు నమోదు కానున్నట్లు తెలుస్తోంది.**



## పవన్‌కు అమిత్ షా ప్రశంసలు

**ఢిల్లీ:** జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొని మహాయుతి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేసిన విషయం తెలిసిందే. పవన్ ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో సభలకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు. ఆయా నియోజకవర్గాల్లో మహాయుతి అభ్యర్థులు విజయం సాధించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ను ప్రజాకర్షక నేత (క్రౌడ్‌పుల్లర్)గా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అభివర్ణిస్తూ ప్రశంసించారు. మహారాష్ట్రలో పవన్ ప్రచారం చేసిన అన్ని నియోజకవర్గాల్లో మహాయుతి అభ్యర్థులు గెలిచారన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షాను లోక్ సభలో జనసేన పక్ష నాయకుడు బౌలశౌరి నిన్న ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్ర ప్రజల్లో ఉన్న ఆదరణతో తమ గెలుపులో పవన్ కల్యాణ్ భాగస్వామ్యమయ్యారని అమిత్ షా ప్రశంసించారు. మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి విజయం సాధించినందుకు బాలశౌరి అమిత్ షాకు అభినందనలు తెలిపారు.

# నేనొస్తున్నా నరకం చూపిస్తా

**హమాస్‌కు డొనాల్డ్ ట్రంప్ బిగ్ వార్నింగ్**



**మహా:** వచ్చే ఏడాది జనవరి 20న ఆయన అగ్రరాజ్యం అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిరోహించనున్నారు. ఇక బాధ్యతలు చేపట్టకుండే డొనాల్డ్ ట్రంప్ పాలస్తీనాకు చెందిన హమాస్ ఉగ్రవాద సంస్థకు బిగ్ వార్నింగ్ ఇచ్చారు. గాజా బందీలను వెంటనే విడుదల చేయాలని, తాను బాధ్యతలు చేపట్టక ముందే ఆ ప్రక్రియ పూర్తికావాలని, లేకుంటే నేను అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత నరకం చూపిస్తా అంటూ సోషల్ మీడియా వేదికగా ట్రంప్ భారీ హెచ్చరిక జారీ చేశారు. ఇజ్రాయెల్ గణాంకాల ప్రకారం.. గత సంవత్సరం ఇజ్రాయెల్ పై దాడి సమయంలో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్ – అమెరికా పౌరులతోసహా 250 మందిని బందీలుగా చేసుకున్నారు. గాజాలో ఇప్పటికీ 101 మంది వరకు విదేశీయులు, ఇజ్రాయెల్ ప్రజలు బందీలుగా ఉన్నట్లు, వారంతా సజీవంగా ఉన్నట్లు భావిస్తున్నారు. అయితే, గతంలో డొనాల్డ్ ట్రంప్ గాజాలోని బందీలను విడుదల చేయాలని హమాస్‌కు సూచించారు. తాజాగా హమాస్ ను హెచ్చరిస్తూ బిగ్ వార్నింగ్ ఇచ్చారు. నేను అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి బందీలను విడుదల చేయకుంటే నరకం చూపిస్తా అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఇదిలాఉంటే.. ఇటీవల హమాస్ యాక్టింగ్ గాజా చీఫ్ ఖలీల్ అల్ హయ్యా ఇటీవల ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. పాలస్తీనా భూభాగంలో యుద్ధం ముగిసే వరకు గాజాలో బందీలను విడిచిపెట్టే ఉద్దేశం లేదని, అలాంటి పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. ఈ క్రమంలో డొనాల్డ్ ట్రంప్ హమాస్ సంస్థకు వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ట్రంప్ వార్నింగ్ కు హమాస్ ఉగ్రవాద సంస్థ ఏ విధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సిందే. హమాస్ కు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇవ్వడంపై ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జాగ్ స్పందించారు. ట్రంప్ కు కృతజ్ఞతలు తెలిపారు. హమాస్ బందీలుగా ఉన్న మా సోదరసోదరీమణులను స్వస్థలాలకు తిరిగివచ్చే సమయం కోసం మేమంతా ప్రార్థిస్తున్నాం అని అన్నారు.

**హైడ్రాకు భారీగా నిధులు**

## విడుదల చేసిన ప్రభుత్వం




**హైదరాబాద్:** వాహనాలను కొనుగోలు చేసేందుకు హైడ్రాకు తెలంగాణ ప్రభుత్వం నిధులు ఇచ్చింది. ఈ మేరకు హైడ్రాకు రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులను విడుదల చేస్తూ తెలంగాణ పురపాలక శాఖ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. కార్యాలయ నిర్వహణ, వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసింది.

### అల్మాస్‌గూడలో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్‌లోని మహేశ్వరం నియోజకవర్గంలో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పోరేషన్‌లోని అల్మాస్‌గూడ గ్రామంలో శ్రీవెంకటేశ్వర కాలనీలోని పార్క్ స్థలంలో ఏర్పాటు చేసిన రెడిమేడ్ కంటైనర్‌ను హైడ్రా అధికారులు తొలగించారు. హైడ్రా ఇన్స్‌పెక్టర్ తిరుమలేశ్ ఆధ్వర్యంలో జేసీబీతో తొలగించారు.

## భారత అమ్ముల పొదిలోకి సరికొత్త అస్త్రం

**సైన్యం చేతికి నాగాస్త్ర డ్రోన్.. ఎనీటైం ఎటాక్**




**మహా:** భారత అమ్ముల పొదిలోకి సరికొత్త అస్త్రం చేరింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన అధునాతన డ్రోన్లు భారత సైన్యానికి అందుబాటులోకి వచ్చాయి. సూసైడ్ డ్రోన్‌గా పిలిచే నాగాస్త్ర1 భారత్ ఆయుధ సంపదలో వచ్చి చేరింది. మహారాష్ట్ర నాగ్‌పుర్‌లోని సోలార్ ఇండస్ట్రీస్ తాము అభివృద్ధి చేసిన 480 నాగాస్త్ర1 లోటరింగ్ ఆయుధాలను భారత సైన్యానికి అందించింది. 75 శాతంపైగా స్వదేశీ పరిజ్ఞానంతో వీటిని ఆ సంస్థ తయారు చేసింది. వైమానిక దాడుల నిమిత్తం వినియోగించే నాగాస్త్రాలను ఆత్మాహుతి డ్రోన్‌గా పేరొంది. GPS ఆధారంగా పని చేసే నాగాస్త్ర1 కచ్చితత్వంతో దాడి చేయగలదు. తొమ్మిది కిలోల బరువుండే ఈ డ్రోన్ దాదాపు 45 మీటర్ల ఎత్తు వరకు ఎగరగలదు. దాదాపు గంటసేపు ఈ నాగాస్త్ర డ్రోన్లు గాల్లో చక్కర్లు కొట్టగలవు. రాడార్లకు దొరక్కుండా దాడులు చేయగలడం వీటి ప్రత్యేకత. రాత్రి వేళల్లోనూ ఇవి ఖచ్చితత్వంతో పనిచేయగలవు. అభివృద్ధి చెందిన దేశాల వద్ద ఉన్న డ్రోన్ల కంటే నాగాస్త్ర డ్రోన్లు మరింత మెరుగైనవని భారత సైన్యం తెలిపింది. లక్ష్యాన్ని గుర్తించలేకపోయినా లేదా మిషన్‌ను మధ్యలో రద్దు చేసినా వీటిని తిరిగి వెనక్కి రప్పించవచ్చనని వెల్లడించింది. సాఫ్ట్ ల్యాండింగ్ కోసం దీనికి పారాషూట్ సదుపాయం కూడా ఉంటుందని పేర్కొంది. భవిష్యత్తులో నాగాస్త్ర2, నాగాస్త్ర3 పేరుతో వీటి నెక్స్ట్ జనరేషన్ డ్రోన్ల తయారీపై సోలార్ ఇండస్ట్రీస్ పనిచేస్తున్నాయని తెలిపింది. అలాగే మీడియం ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్ డ్రోన్లను అభివృద్ధి చేసే దిశగా రక్షణ దళాలు.. ప్రయత్నాలు చేస్తున్నాయి. 3 వేల నుంచి 9 వేల మీటర్ల ఎత్తులో మేల్ డ్రోన్లు ఎగరగలవు. ప్రస్తుత అవసరాల దృష్ట్యా 97 మేల్ డ్రోన్లను అందుబాటులో పెట్టుకోవాలని సైన్యం భావిస్తోంది.



## దివ్యాంగులకు శుభవార్త

**పెరగనున్న పెన్షన్.. హామీ ఇచ్చిన మంత్రి సీతక్క**

**హైదరాబాద్, మహా:** ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని దివ్యాంగులకు మంత్రి సీతక్క శుభవార్త చెప్పారు. దివ్యాంగుల పెన్షన్ పెంచుతామంటూ పేర్కొన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. అవయవ లోపాలను మన తప్పులుగా భావించి ఆత్మనూన్యత భావానికి గురికావొద్దని, ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారంటూ, పట్టుదలతో ఇతరులకు ఆదర్శంగా ఎదగాలంటూ దివ్యాంగులకు మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఉన్నటువంటి 10 లక్షల మంది దివ్యాంగుల సంక్షేమానికి రూ. 50 కోట్ల నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిందన్నారు. త్వరలోనే దివ్యాంగుల పెన్షన్లు పెంచుతామంటూ హామీ ఇచ్చారు. అదేవిధంగా వారి స్వయం ఉపాధి కోసం స్కూటర్లు కూడా ఇస్తామని పేర్కొన్నారు. ప్రత్యేకంగా జాబ్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకొచ్చి ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తున్నామన్నారు.

## పార్లమెంటు ముందు ప్రతిపక్షాల ఆందోళన

**మహా:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు కొనసాగుతున్నాయి. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి కూడా ఉభయ సభల్లోనూ విపక్షాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నాయి. అదానీ అంశం, మణిపూర్ హింస, అజ్మీర్ దర్గా, సంభాల్ ఘటనతోపాటు పలు అంశాలపై చర్చ పెట్టాలంటూ పట్టుబడుతున్నాయి. ఈ క్రమంలో సభలు గత వారం రోజులుగా వాయిదా పడ్డాయి. ప్రారంభరోజు నుంచి ఉభయ సభలు కార్యకలాపాలేవీ జరపకుండానే వాయిదా పడుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆదివారం కూడా సభను జరపాల్సి వస్తుందంటూ పార్లమెంటు స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. మంగళవారం ఇరు సభలు సజావుగా ప్రారంభమయ్యాయి. అయితే, ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలు తమ ఆందోళనను కంటిన్యూ చేశాయి. అదానీ అంశం, యూపీలోని సంభాల్ హింసపై వెంటనే చర్చ జరపాల్సిందేనంటూ డిమాండ్ చేశాయి. చర్చకు స్పీకర్ నో చెప్పారు. ఇందుకు నిరసనగా విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. అనంతరం పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో నేతలంతా ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేశారు. ప్రభుత్వం అదానీ అంశంపై ఎందుకు చర్చ జరపడంలేదంటూ నిలదీశారు. వెంటనే పార్లమెంటులో అదానీ అంశంపై చర్చ జరపాలంటూ వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో తృణమూల్ కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీలు గైర్హాజరవడం గమనార్హం.



**కాంగ్రెస్ ప్రభుత్వం**

## పాసైంది

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశంసల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పనితీరు బాగుందని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తొలి ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం 60 శాతం మార్కులతో పాస్ అయ్యిందని కూనంనేని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే 90 శాతానికి పైగా మెరుగ్గా కాంగ్రెస్ ప్రభుత్వం పాలనను కొనసాగిస్తుందన్నారు. ప్రతిపక్ష అంటే తిట్లు తిట్టడం, శాపనార్థాలు పెట్టడం కాదని, ప్రతిపక్షంలో కూడా నిర్మాణాత్మక పాత్రను పోషించాలంటూ కూనంనేని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చినా కూడా ప్రజా ఉద్యమాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గబోమంటూ ఆయన స్పష్టం చేశారు.

# రంగంలోకి విద్యా కమిషన్


(మొదటిపేజీ తరువాయి)





తనిఖీ చేశారు. ఈ తనిఖీలు భాగంగా ఆయన పాఠశాలల్లో వసతి సదుపాయాలు, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు, ల్యాబ్లు, వంటశాలలు, స్టోర్ రూమ్ లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. గొందిగూడెం గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లలో ట్యాప్ లు లీకేజీని గుర్తించి రిపేరు చేయించాల్సిందిగా ఆదేశించారు. వంటశాలలో మధ్యాహ్న భోజన పథకం, వసతి గృహంలో విద్యార్థులకు ఒకే చోట వేరువేరు పదార్థాలు వండటం గమనించిన ఆయన ఒకే చోట విద్యార్థులకు వేరువేరు పదార్థాలు వడ్డించడం సరికాదని, అందరికీ ఒకే రకమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వంటశాలలో యంత్ర పరికరాలు పనిచేయక పోవడం, కట్టెల పొయ్యి మీద వండటాన్ని ఆయన గుర్తించి వెంటనే వంట పరికరాలను రిపేరు చేయించాల్సిందిగా ఆదేశించారు. మణుగూరు జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో వంటశాల తరగతి గదులను పరిశీలించి ఉపాధ్యాయులు విద్యార్థులకు ఏ విధంగా బోధిస్తున్నారో అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. కొంతమంది విద్యార్థులు కలెక్టర్, ఇంజనీర్, డాక్టర్ అవుతామని అన్నారు. ఉన్నత చదువులు చదవాలంటే ఇంగ్లీష్‌మీడియం, ఇంగ్లీష్‌లో పట్టు సాధించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అవసరమైన అవగాహన కల్పించి వారి లక్ష్య సాధనకు బాటలు వేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో మీటింగ్ నిర్వహించి పాఠశాలలో బైలింగ్ వెల్ విధానం, పాఠశాలల్లో సెమిస్టర్ పరీక్ష విధానం, విద్యార్థుల్లో చదవడం, వ్రాయడంలో నైపుణ్యం సాధించుటకు తీసుకోవలసిన చర్యలపై అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో వివిధ పాఠశాలల్లో ఫుడ్ పాయిజనింగ్ జరిగి విద్యార్థులు అనారోగ్యం పాలు అవ్వడాన్ని తెలంగాణ విద్యా కమిషన్ సీరియస్ గా తీసుకుందన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంలో భాగంగానే రాష్ట్రంలో విద్యార్థులకు సమగ్ర విద్యను అందించేందుకు నూతన విద్యా విధానం అమలు చేయడానికి తీసుకోవలసిన చర్యల గురించి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి అందరి అభిప్రాయాలు సేకరిస్తున్నామని తెలిపారు. ఇది విద్యార్థుల భవిష్యత్తు కోసం ఏదో ఒక నిర్ణయం తీసుకోకుండా ప్రపంచ వ్యాప్తంగా, ప్రైవేట్ పాఠశాలల్లో, కార్పొరేట్ విద్యాసంస్థల అనుసరిస్తున్న విధానాన్ని పరిగణలోనికి తీసుకొని, రానున్న రోజుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఆయన అన్నారు. ఈ తనిఖీలలో డీడీ ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి దాసరి అనసూయ, బీసీ వెల్ఫేర్ అధికారి ఇందిరా, మహిళా శిశు సంక్షేమ అధికారి లెనినా, కేబీవీపీ అధికారిని అన్నామలై, ఎంఈఓ స్వర్ణ జ్యోతి, హెడ్ మాస్టార్ జి. నాగశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో వీరమల్లు



**మహా:** రాజకీయాల్లో పూర్తిగా బిజీ అయిన పవన్ కల్యాణ్ ప్రస్తుతం కొంత గ్యాప్ దొరకడంతో 'హరిహర వీరమల్లు' సినిమా పూర్తి చేసే పనిలో పడ్డారు. ప్రస్తుతం ఈ మూవీ చివరి షెడ్యూల్ షూటింగ్ మంగళగిరిలో వేసిన ఓ సెట్‌లో జరుగుతోంది. దీనిలో భాగంగా మేకర్స్ ఈ సినిమా యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేస్తున్నారు. తాజాగా పవన్ ఈ మూవీ షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా 'హరిహర వీరమల్లు' సెట్స్ లో దిగిన సెల్ఫీని తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు.



## రియల్ రంగంలో
# హైదరాబాద్ నెం.1

### బిల్డ్ నౌ యాప్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు
### భవనాలు, లే అవుట్లకు ఆన్ లైన్‌లో అనుమతులు

**హైదరాబాద్, మహా:** రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ నెంబర్ వన్ గా ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. భవనాలు, లే అవుట్ల అనుమతుల కోసం 'బిల్డ్ నౌ' పేరుతో నూతన ఆన్ లైన్ విధానాన్ని మంగళవారం మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుంది. అందులో భాగంగా గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణాభివృద్ధిలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టి, వాటిని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రజలు ఎక్కువ శాతం నివాసముంటున్నందున, ఈ శాఖ ప్రాధాన్యతపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో వ్యాపారాలు చేసుకునేందుకు అనువైన వాతావరణం కల్పిస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం. స్థిరాస్తి రంగంలో హైదరాబాద్ ఇప్పటికీ మొదటి స్థానంలోనే కొనసాగుతూ ఉంది. హైదరాబాద్ ప్రజలు అధికంగా గృహ రుణాలు తీసుకుంటున్నారు. భవన అనుమతులకు సంబంధించి 'బిల్డ్ నౌ' పేరుతో తీసుకొచ్చిన ఈ కొత్త విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే వెంటనే భవనాల నిర్మాణాలకు, లే అవుట్లకు వెంటనే అనుమతులు లభిస్తాయి' అంటూ మంత్రి పేర్కొన్నారు.

# పైసా వసూల్‌లో ఎ-గ్రేడ్

### పాల్వంచ చెక్ పోస్ట్ పై నిఘా వర్గాల ఫోకస్
మహా కథనంతో ప్రకంపనలు .. కదిలిన అధికారులు
ఏ క్షణంలోనైనా చెక్ పోస్ట్ పై దాడులకు అవకాశం ఉందంటున్న అధికారులు
అప్రమత్తమైన పాల్వంచ చెక్ పోస్ట్ అధికారులు




**మహా , భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో :** అవినీతికి కేరాఫ్ అడ్రస్ గా మారిన రవాణా తనిఖీ కేంద్రంపై రాష్ట్రస్థాయి అధికారులు నిఘా టీమ్ లను ఏర్పాటుచేసినట్లు తెలిసింది. ఓ వైపు ప్రజావిజయోత్సవాల్లో బిజీగా ఉన్నా.. రవాణా చెక్ పోస్ట్ ల వద్ద సాగుతున్న దందా మంత్రి దృష్టికి రావడంతో స్పందించారు. దీనిపై వివరాలు తెప్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. పైసా వసూల్ పాల్వంచ చెక్ పోస్ట్ పై మహా పత్రిక అందించిన వరుస కథనాల కథనాల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన చెక్ పోస్ట్ లు, సరిహద్దు చెక్ పోస్టులకు సంబంధించి నివేదికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. అవినీతి ఆరోపణలు, పైసా వసూల్ ఆరోపణల్లో పాల్వంచ చెక్ పోస్ట్ ఎ గ్రేడ్ లో ఉన్నట్లు రాష్ట్ర అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. పాల్వంచ చెక్ పోస్ట్ పై నిఘా వర్గాలు కన్నేశాయన్న ప్రచారం నేపథ్యంలో.. స్థానిక అధికారులు అలర్ట్ అయినట్లు తెలుస్తోంది. ఏ క్షణంలోనైనా దాడులు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. దీంతో చెక్ పోస్ట్ లో వసూళ్ళ రాయుళ్ళ నుండి పైస్థాయి దాకా అధికారులకు గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. వసూలు చేస్తున్న డబ్బులు ఎప్పటికప్పుడు దాటవేస్తున్నట్లు తెలుస్తుంది. నిత్యం వాహనదారుల నుండి లక్షల్లో వసూలు చేసిన అవినీతి సొమ్మంతా ఎవరెవరికి చేరవేస్తున్నారనే కోణంలో నిఘా వర్గాలు దర్యాప్తు చేపడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో ఏ అధికారులకు ఎంత వాటాలు అందుతున్నాయని, అవి ఎవరి ద్వారా చేరవేస్తున్నారనేది ఉన్నతాధికారులు ఆరా తీస్తూ నివేదిక రూపొందిస్తున్నట్లు సమాచారం, . పాల్వంచ చెక్ పోస్ట్ పై రాసిన వరుస కథనాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పలువురు లారీల యాజమానులు, ఆటో డ్రైవర్స్ మహాపత్రిక కథనాలను అభినందిస్తూ అవినీతి అధికారుల భరతం పట్టాలంటూ వివరాలు అందిస్తున్నారు.

## హైదరాబాద్‌ను
# విశ్వనగరం చేస్తాం




(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లుగా రేవంత్ రెడ్డి వివరించారు. ఎస్టీపీలు, ఫ్లైఓవర్లు, నాలాల అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్లో నిర్వహించిన రైజింగ్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రజా పాలన కోసం ఏడాది క్రితం ప్రజలు తీర్పు ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని వివరించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని పెంచామని గుర్తు చేశారు. మెట్రోను హైదరాబాద్‌కు తీసుకొచ్చింది కాంగ్రెస్సేనన్న రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆదాయంలో 60 శాతం హైదరాబాద్, రంగారెడ్డి నుంచే వస్తుందని పేర్కొన్నారు.

**రీజినల్ రింగ్ రోడ్డు మణిహారం**

రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణకే మణిహారమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రూ.35 వేల కోట్లతో 360 కి.మీ రీజినల్ రింగ్ రోడ్డుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌ను నిర్మించబోతున్నామని వివరించారు. ఓఆర్ఆర్‌కు అనుబంధంగా ముచ్చర్ల ప్రాంతంలో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తామని తెలిపారు. 40 నుంచి 50 వేల ఎకరాల్లో అద్భుతంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తాం అని ఆయన పునరుద్ఘాటించారు. టోక్యో, న్యూయార్క్‌తో పోటీ పడేలా నిర్మిస్తామన్న రేవంత్ రెడ్డి రూ.లక్షన్నర కోట్లు ఖర్చు పెడితే హైదరాబాద్ అద్భుత నగరం అవుతుందని రేవంత్ వివరించారు.

**అబద్ధాలతో సెల్ఫ్ డబ్బా**

గత ముఖ్యమంత్రి అబద్ధాలతో గడిపేశారని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. పాతబస్తీని ఇస్తాంబుల్ చేశామన్నారన్న సీఎం రేవంత్ హైదరాబాద్ నగర అభివృద్ధికి గత ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. కాలుష్యం పెరిగి ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, చెన్నై, కోల్‌కతా నగరాలు నివసించేందుకు వీలు లేకుండా మారాయని రేవంత్ రెడ్డి తెలిపారు. 10 లక్షల లీటర్ల నీటిని నిల్వ చేసే విధంగా వాటర్ హార్వెస్టింగ్ బావులను నిర్మిస్తున్నామని ఆయన వెల్లడించారు. తమ ప్రభుత్వ హయాంలో రియల్ఎస్టేట్ వ్యాపారం 29 శాతం పెరిగిందన్నారు. అక్రమ నిర్మాణాలను మాత్రమే హైడ్రా కూల్చుతోందని రేవంత్ తెలిపారు. మూసీ పునరుజ్జీవనం చేయకుండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని విమర్శించారు.

**కిషన్ రెడ్డి నిధులు తీసుకురా**

హైదరాబాద్ నగర అభివృద్ధిపై బీజేపీ, బీఆర్ఎస్ దొందుదొందుగానే తయారయ్యాని సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా విమర్శించారు. బీఆర్ఎస్ గత పదేళ్ల పాలనకు హుస్సేన్ సాగర్ లోని నీళ్లు అద్దంపడుతున్నాయని దుయ్యబట్టారు. మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్న బీజేపీ కిషన్ రెడ్డి మోడీని ఒప్పించి లక్షన్నర కోట్ల నిధులు తీసుకురావాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలో శాశ్వత ప్రతిపాదికన మెట్రో విస్తరణ, మూసీ పునరుజ్జీవం పనులు చేయాలంటే లక్షన్నర కోట్లు అవసరం అవుతాయన్న రేవంత్ రెడ్డి ఆ నిధులను తీసుకొస్తే 10 లక్షల మంది సమక్షంలో మోదీని, కిషన్ రెడ్డిని సన్మానిస్తామని ప్రకటించారు. మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళనపై బీజేపీ తమ విధానాన్ని చెప్పాలని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై కక్ష్య ఉంటే వేరే రకంగ చూసుకోవాలని, హైదరాబాద్‌ను అడ్డుకోవద్దని రేవంత్ రెడ్డి హితవు పలికారు.

### హైదరాబాద్ నగర అభివృద్ధిపై
## మంత్రివర్గ ఉపసంఘం

బీజేపీ, బీఆర్ఎస్ నగర అభివృద్ధిపై తమ విధానాలను వెల్లడించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో ఉప సంఘం ఉంటుందని, అఖిల పక్షంతో కలిసి వచ్చి నగర అభివృద్ధిపై పాలసీ డాక్యుమెంట్‌ను తెలంగాణ సమాజానికి చూపించాలని సీఎం కోరారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.






# మంత్రి కోమటిరెడ్డి సీరియస్

### విద్యార్థుల మరణాలపై తీవ్ర దిగ్భ్రాంతి
ఏదైనా సమస్య ఉంటే తనకు ఫోన్ చేయాలన్న మంత్రి
బ్రతికి సాధించాలని విద్యార్థులకు పిలుపు



**హైదరాబాద్, మహా:** ఇంటర్ కాలేజీల్లో విద్యార్థుల మరణాల విషయమై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సీరియస్ అయ్యారు. ఇందుకు సంబంధించి ఆయన మాట్లాడుతూ.. 'పది రోజుల్లో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం దారుణం. ర్యాంకుల పేరిట విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేసే విధానాలను ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు మానుకోవాలి. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్న కాలేజీలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. ఎట్టి పరిస్థితుల్లో వారిని వదలబోం. విద్యార్థులు అధైర్యపడి క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకొని తల్లితండ్రులకు గర్భశోకం మిగిల్చవద్దని కోరుతున్నా. విద్యార్థులకు ఏదైనా అత్యవసర సమస్య ఉంటే నా ఆఫీసు మొబైల్ నెంబర్ ను 8688007954 లేదా minister.randbc@gmail.com ఈమెయిల్ కు తెలియజేయండి. వెంటనే స్పందించి మీ సమస్యను పరిష్కరిస్తాం. అంతేకానీ, చావు సమస్యకు అంతిమ పరిష్కారం కాదు, బ్రతికి సాధించాలి' అంటూ విద్యార్థులకు మంత్రి పిలుపునిచ్చారు.



# మంత్రిపై బురద చల్లిన ప్రజలు

### నెట్టింటా వైరలవుతున్న వీడియో

**చెన్నై:** తమిళనాడు రాష్ట్రంలో ఫెయింజల్ తుఫాను తీవ్ర బీభత్సం సృష్టిస్తోంది. 20 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఎక్కడ చూసినా వరద నీరే కనిపిస్తోంది. దీంతో ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే, ఓ మంత్రికి పరాభవం ఎదురైంది. అందుకు సంబంధించిన వీడియోను అక్కడి బీజేపీ నేత అన్నామలై సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "ప్రస్తుతం తమిళనాడులో తుఫాను విలయం తాండవం సృష్టిస్తోంది. దీంతో పరిస్థితి అధ్వానంగా ఉంది. కానీ, సీఎం, డిప్యూటీ సీఎం చెన్నై వీధుల్లో ఫొటోలు దిగడంలో బిజీ బిజీగా ఉన్నారు. వరద బాధితులను పట్టించుకోవడంలేదు. దీంతో తమ ప్రాంతాల్లో పర్యటన చేసేందుకు వచ్చిన మంత్రిపై ప్రజలు బురద చల్లారు. బాధితుల ఆవేదన ఏ స్థాయిలో ఉందో ఇట్టే మనకు అర్థమవుతుంది. డీఎంకే పార్టీకి ఇది ముందస్తు హెచ్చరిక. ఇప్పటికైనా సహాయక చర్యలను ముమ్మరం చేయాలి" అంటూ అందులో పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింటా తెగ వైరల్ అవుతోంది.

# ఢిల్లీలో నివసించడం ఇష్టం లేదు

### ప్రతిసారి వెళ్లాలా.. వద్దా? అని ఆలోచిస్తా
### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



**మహా:** కేంద్రమంత్రి నితీన్ గడ్కరీ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం విషయమై ఆయన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. వాయు కాలుష్యం కారణంగా తనకు ఢిల్లీలో నివసించడం అస్సలు ఇష్టం ఉండదన్నారు. వాయు కాలుష్యం వల్ల ఎక్కడ అనారోగ్యానికి గురవుతామేమోననే ఆందోళన కలుగుతుంటదన్నారు. అందుకే ప్రతిసారి ఢిల్లీకి వెళ్లాలా..? వద్దా..? అని ఆలోచిస్తానంటూ ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో రోజురోజుకు వాయు కాలుష్యం పెరుగుతుందంటూ ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడమే వాయు కాలుష్య కట్టడికి తగిన మార్గమంటూ కేంద్రమంత్రి పేర్కొన్నారు.

# హైడ్రా కూల్చివేతలు మళ్లీ స్టార్ట్

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో చెరువులపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న సంచలన నిర్ణయమే హైడ్రా. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న చాలా అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. రాష్ట్ర చరిత్రలోనే హైడ్రా ఏర్పాటు చేసిన 100 రోజుల వ్యవధిలోనే 300 అక్రమ నిర్మాణాలకు పైగా నేలమట్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19వ తేదీన హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 99ను తీసుకువచ్చింది. దీంతో జూలై 26 నుంచి కూల్చివేతలను మొదలుపెట్టింది హైడ్రా. ఇప్పటి వరకు 30 ప్రాంతాల్లో 300 ఆక్రమణలను కూల్చివేసింది. 100 రోజుల్లో 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగించింది. జీహెచ్ఎంసీతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు మామూలుగా లేదు. హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో దేశవ్యాప్తంగా హైడ్రా పేరు మారుమోగిపోయింది.



**అల్మాస్‌గూడలో హైడ్రా కూల్చివేతలు**

బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలో ఇవాళ (మంగళవారం) హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అల్మాస్‌గూడాలో కబ్జాకు గురైన పార్కును హైడ్రా అధికారులు కాపాడారు. పిల్లల ఆట పరికరాలను తొలగించి ఆ స్థలం తనదంటూ ఓ వ్యక్తి కంటైనర్ ఏర్పాటు చేయడంతో స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్థానికంగా లేఅవుట్లను పరిశీలించి.. పార్కు స్థలంగా హైడ్రా అధికారులు గుర్తించారు. కంటైనర్ తొలగించి పార్కు స్థలాన్ని కాలనీవాసులకు హైడ్రా అధికారులు అప్పగించారు.

**తీవ్ర వ్యతిరేకత రావడంతో..**

అయితే.. హైడ్రా కూల్చివేతలపై ప్రజలు హడెలెత్తిపోయారు. ఎప్పుడు ఎవరి ఇంటిని కూల్చివేస్తారో అని భయాందోళనలో గడిపారు ప్రజలు. హైడ్రా కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత కూడా వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు.

**ఏకధాటిగా కూల్చివేతలు..**

నగరంలోని కూకట్‌పల్లి, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను హైడ్రా నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది. మూడు ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించింది హైడ్రా. ఈ సమయంలో హైడ్రాపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ.లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు. అలాగే అమీన్ పూర్‌లో హైడ్రా బిగ్ ఆపరేషన్‌ను నిర్వహించింది. పగలు రాత్రి కూల్చివేతలు చేపట్టింది. దాదాపు 17 గంటలపాటు హైడ్రా నాన్ స్టాప్ కూల్చివేతలు చేపట్టింది. ఓ హాస్పిటల్, రెండు అపార్ట్ మెంట్లు కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. పటేల్ గుడాలో 16 విల్లాలను కూల్చివేసింది.

**పూర్తిస్థాయిలో బాధ్యతలు...**

ఇటీవల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రేటర్ పరిధిలోని అక్రమ కట్టడాలన్నీ కూల్చివేసే పవర్ హైడ్రాకు ఇచ్చింది. ఈ మేరకు జీవో నెంబర్ 199ను ప్రభుత్వం విడుదల చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో పలుమార్పులు చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో మున్సిపల్ శాఖలో 374B ప్రత్యేక సెక్షన్ చేర్చింది. దీంతో బల్దియాతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల పరిధిలో హైడ్రా దూకుడు పెంచనుంది. ఇక నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తారు. అక్రమ కట్టడాలకు నోటిసులు జారీ నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రా చేయనుంది.

EDITORIAL ఎడిటోరియల్

# యువజన సంక్షోభం



ప్రపంచ వ్యాప్తంగా జనాభా సంక్షోభం ఇపుడు ప్రధాన సమస్యగా మారుతోంది. ఆయా దేశాలను ఆందోళనలకు గురిచేస్తోంది. ఇంతకాలం చైనా ఈ సమస్యతో సతమతమవుతుండగా, తర్వాత గ్రీస్, టర్కీ ఇలా అనేక దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇపుడు భారత్ యువ దేశమైనా.. నమోదవుతున్న గణాంకాలు ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. తాజాగా ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలు.. అప్రమత్తం కావాల్సిన హెచ్చరికగా కనిపిస్తున్నాయి. భారతదేశంలో జనాభా నియంత్రణ పద్ధతులు పక్కనపెట్టి యువశక్తిని దేశనిర్మాణం కోసం పెంపొందించుకోవాల్సిన అనివార్యతను చాటుతున్నాయి. ప్రపంచంలోనే ఎక్కువ యువత ఉన్న దేశం మనది.. ఒళ్లొంచి పని చేసే యువ జనాభా ఎక్కువగా ఉండటమే భారత్ బలం. అయితే, ఈ బలం భవిష్యత్తులో ఉండకపోవచ్చు. ఇప్పటి 'యువ భారతం' మూడు దశాబ్దాల తరువాత 'వృద్ధ భారతం'గా మారబోతున్నది. జనాభా రేటు తగ్గిపోయి, వృద్ధుల జనాభా పెరగడం వల్ల ఇప్పుడు జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి. ఆ దేశాల అభివృద్ధికి ఇది అడ్డంకిగా మారుతున్నది. ఇదే పరిస్థితి 30 ఏండ్ల తర్వాత మన దేశానికీ ఎదురుకాబోతున్నది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉండనుంది. ఇటీవల దేశ సగటు 2.1గా నమోదవుతుండగా, ప్రతీ ఒక్కరు కనీసం ముగ్గురు పిల్లలను కంటేనే భవిష్యత్తులో యువత, 'వృద్ధ మధ్య అసమానతలు ఉండవు. లేకుంటే 'వృద్ధ జనాభాతో దేశం నిండిపోయే ప్రమాదముంది. పాఠశాలలు 'వృద్ధాశ్రమాలుగా మారే సూచనలు ఉన్నాయి.

## 6.18 నుండి 2కి

ఒక మహిళ 15 ఏండ్ల నుంచి 49 ఏండ్ల మధ్య వయసులో జన్మనిచ్చే పిల్లల సంఖ్య సగటును సంతానోత్పత్తి రేటుగా లెక్కిస్తారు. 1950లో దేశంలో సంతానోత్పత్తి రేటు 6.18గా ఉండేది. అధిక జనాభా కారణంగా ఆహార కొరత వంటి సమస్యలు తలెత్తడంతో 1951 నుంచి కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఇద్దరిని మించి కనవద్దని అవగాహన కల్పించారు. దీంతో క్రమంగా సంతానోత్పత్తి రేటు తగ్గుతూ వచ్చింది. ఈ తగ్గుదల మరీ ఎక్కువ కావడమే ఇప్పుడు సమస్యగా మారింది. జనాభా తగ్గొద్దంటే సంతానోత్పత్తి 2.1గా ఉండాలి. మన దేశంలో సంతానోత్పత్తి రేటు వేగంగా ఈ రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగువకు పడిపోతున్నది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 31లో సంతాన రేటు 2.1కు, అంతకు దిగువకు పడిపోయింది. బీహార్, యూపీ, జార్ఖండ్, మేఘాలయ, మణిపూర్ మాత్రమే ఎగువన ఉన్నాయి. 201921కి దేశంలో సంతానోత్పత్తి రేటు 2.0తో రీప్లేస్‌మెంట్ స్థాయికి దిగువకు తగ్గినట్టు కేంద్రం వెల్లడించింది. భారత్‌లో సంతానోత్పత్తి ఇలాగే కొనసాగితే 2050 నాటికి 1.29కు పడిపోతుందని ఇటీవల లాన్సెట్ జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. అంటే, మరో మూడు దశాబ్దాల్లో దేశంలో వృద్ధుల జనాభా భారీగా పెరగడంతో పాటు మొత్తం జనాభా సంఖ్య తగ్గిపోనున్నది. ఇదే జరిగితే దేశానికి బలంగా ఉన్న శ్రామిక శక్తి తగ్గిపోయి ఆర్థిక వృద్ధి కుంటుపడుతుంది. ప్రస్తుతం చైనా అనేక చర్యలు తీసుకున్నా యువత ఒంటరిజీవితానికే మొగ్గు చూపుతున్నారు. పెళ్ళి, పిల్లలపై ఇష్టపడడం లేదు. వివాహాలను ప్రోత్సహించి, విడాకుల నిబంధనలు కఠినతరం చేయడంతో పాటు అనేక చర్యలు తీసుకున్నా.. అక్కడ పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఈ నేపథ్యంలో అత్యధిక జనాభా కలిగిన భారత్ ప్రమాదాన్ని గ్రహించి అప్రమత్తం కావాల్సి ఉంది.



భారత్- అమెరికా వ్యూహాత్మక బంధంలో మరో కీలక పరిణామం

### రఫేల్-ఎం యుద్ధ విమానాల కొనుగోలుకు

# భారత్ రెడీ

**ఢిల్లీ:** రఫేల్‌ఎం యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి భారత్‌ఫ్రాన్స్ మధ్య త్వరలోనే ఒప్పందం కుదరనుంది. నౌకాదళం కోసం అదనంగా మూడు స్కార్పియన్ శ్రేణి జలాంతర్గాములు, 26 రఫేల్ ఎం విమానాలను భారత్ కొనుగోలు చేయనుంది. మరోవైపు, భారత్‌కు భారీస్థాయిలో హెలికాప్టర్ విడిభాగాల విక్రయానికి అమెరికా ఆమోదం తెలిపింది. ఈమేరకు పెంటగాన్ ఓ కీలక ప్రకటన చేసింది.

## వచ్చే నెలలో ఒప్పందం

ఫేల్‌ఎం యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందాలపై వచ్చే నెలలో సంతకాలు జరగవచ్చని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి తెలిపారు. ఇప్పటికే ఈ ఒప్పందం కోసం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ కొన్ని నెలల క్రితం ఫ్రాన్స్‌ను సందర్శించి మంతనాలు జరిపారు.

విమాన వాహక నౌక ఐఎన్ ఎస్ విక్రాంత్ సహా వివిధ స్థావరాల్లో రఫేల్‌ఎం యుద్ధ విమానాలను మోహరించాలని భారత నౌకాదళం భావిస్తోంది. వీటిరాకతో భారత తీర ప్రాంత రక్షణ, శత్రువుపై దాడి చేసే సామర్థ్యాలు మరింత పెరగనున్నాయి. సెప్టెంబర్‌లోనే రఫేల్‌ఎం యుద్ధ విమానాలకు సంబంధించిన తుది ధరలను భారత్‌కు ఫ్రాన్స్ ఇచ్చింది. 22 సింగిల్ సీటర్ రఫేల్ మెరైన్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, మరో నాలుగు ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఫ్రాన్స్ నుంచి కొనుగోలు చేయాలని భారత్ భావిస్తోంది. వీటితో పాటు పెద్ద సంఖ్యలో దీర్ఘశ్రేణి ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్‌ను, యాంటీ షిప్ ఆయుధాలను ఈ ప్రాజెక్టులో భాగంగా భారత్ సమకూర్చుకోనుంది.

## రూ.9వేల కోట్లకుపైగా విలువైన విడిభాగాలు విక్రయం

భారత్కు 1.17 బిలియన్ డాలర్ల (రూ.9.9 వేల కోట్లు) విలువైన హెలికాప్టర్ విడిభాగాల విక్రయానికి అగ్రరాజ్యం ఆమోదించింది. ఈ విడిభాగాలు ఎంహెచ్ 60ఆర్ సీహాక్ హెలికాప్టర్‌ల బలోపేతానికి విక్రయించనున్నట్లు పెంటగాన్ తెలిపింది. లాక్‌హీడ్ మార్టిన్ అనే కంపెనీ ఈ ఒప్పందంలో కీలకపాత్ర పోషించినట్లు వెల్లడించింది.

## ఎంహెచ్-60ఆర్ సీహాక్ స్పెషల్

సముద్రజలాల్లో దాగి ఉన్న శత్రు జలాంతర్గాములు, రాడార్లను నాశనం చేసేందుకు ఈ ఎంహెచ్ 60 సీహాక్ హెలికాప్టర్‌లు వినియోగిస్తారు. ఇందులోని 38 లేజర్ గైడెడ్ రాకెట్‌లు, నాలుగు ఎంకే54 టోర్పిడోలు, మెషీన్‌గన్‌లు శత్రువులను నాశనం చేసేందుకు ఉపయోగపడతాయి. హెలికాప్టర్ ముందుభాగంలోని ఫార్వర్డ్ లుకింగ్ ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు ఎదురుగా ఉన్న జలాంతర్గామి లేదా క్షిపణికి సంబంధించిన కచ్చితమైన చిత్రాన్ని ఆవిష్కరించగలవు. ఈ లోహవిహంగం ఒక ప్రాంతాన్ని స్కాన్ చేయగలదు. క్షిపణి దాడులపై హెచ్చరికలను సైతం చేస్తోంది.

### నౌకాదళ దినోత్సవానికి

# రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

మరోవైపు డిసెంబర్ 4వ తేదీన ఒడిశాలోని పూరిలో జరగనున్న నౌకాదళ దినోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హాజరుకానున్నారు. ప్రస్తుతం నౌకా దళానికి చెందిన 63 యుద్ధ నౌకలు, ఓ జలాంతర్గామి నిర్మాణదశలో ఉన్నాయని నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి తెలిపారు. దేశీయంగా డిజైన్ చేసిన అణుశక్తితో పనిచేసే రెండు అటాక్ సబ్‌మెరైన్ల ప్రాజెక్టు కూడా దేశీయంగా నౌకా నిర్మాణ పరిశ్రమ అభివృద్ధికి దారితీస్తుందన్నారు. ఈ SSN జలాంతర్గాములలో మొదటిదాని సేవలు 203637 నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. ఆ తర్వాత మరో రెండేళ్లకు మిగిలినది కూడా సిద్ధమవుతుందని చెప్పారు. 1971 భారత్‌పాక్ యుద్ధంలో నౌకదళ వీరత్వానికి చిహ్నంగా డిసెంబర్ 4న నేవీ డే వేడుకలు నిర్వహిస్తారు. ఈసారి ఒడిశాలోని పూరి తీరంలో నౌకాదళం తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించనుంది.

### తేనె, తులసి, వేపాకులను

# రోజూ తింటే..

## ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



చలికాలంలో చాలా మందికి సహజంగానే రోగ నిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యలు ఇబ్బందులకు గురి చేస్తుంటాయి. ఇలాంటి సమయంలో రోగ నిరోధక శక్తిని పెంచుకోవాల్సి ఉంటుంది. దీంతో సీజనల్ వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే చలికాలంలో చర్మం పగులుతుంది కనుక చర్మాన్ని సంరక్షించుకోవాల్సి ఉంటుంది. అయితే ఇందుకు ఖరీదైన క్రీములు వాడాల్సిన పనిలేదు. పలు ఆహారాలను రోజూ ఉదయాన్నే తీసుకుంటే చాలు చర్మానికి సంరక్షణ లభిస్తుంది. అలాగే పలు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు. ఇక ఆ ఆహారాలు ఏమిటంటే.. తేనె, తులసి ఆకులు, వేప ఆకులు. ఈ మూడింటినీ మిశ్రమంలా చేసి ఈ సీజన్‌లో రోజూ ఉదయాన్నే తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

## శ్వాసకోశ సమస్యలకు చెక్..

ఆయుర్వేద ప్రకారం తేనె, తులసి ఆకులు, వేపాకులు మనకు ఎంతగానో మేలు చేస్తాయి. ముఖ్యంగా చలికాలంలో రోజూ ఉదయం వీటిని తీసుకుంటే మనకు ఎంతో మేలు జరుగుతుంది. పలు రకాల వ్యాధులను తగ్గించుకోవచ్చు. నాలుగు తులసి ఆకులు, నాలుగు వేపాకులను తీసుకుని పేస్ట్‌లా చేసి అందులో కాస్త తేనె కలిపి ఉదయం పరగడుపున తీసుకోవాలి. ఈ విధంగా తీసుకుంటే ఎన్నో లాభాలు కలుగుతాయి. ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీంతో చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యల నుంచి బయట పడవచ్చు. ముఖ్యంగా దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. ముక్కు దిబ్బడ పోతుంది. అలాగే గొంతు సమస్యలు తగ్గుతాయి. గొంతులో ఉండే నొప్పి, మంటతోపాటు గొంతులో ఉండే కఫం కూడా పోతుంది. ఊపిరితిత్తుల్లో ఉండే కఫం బయటకు వస్తుంది. దీంతో శ్వాస సరిగ్గా ఆడుతుంది.

## జీర్ణ వ్యవస్థకు..

ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. పలు ఇన్‌ఫెక్షన్లు, వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ మిశ్రమాన్ని తింటే జీర్ణక్రియ మెరుగు పడుతుంది. చలికాలంలో చాలా మందికి తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాదు. అజీర్ణ సమస్యతో బాధపడుతుంటారు. అలాంటి వారు రోజూ ఈ మిశ్రమాన్ని తీసుకుంటే ఎంతో ఫలితం ఉంటుంది. దీంతో తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్దకం ఉండవు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది.

## చర్మ సంరక్షణకు..

వేపాకులు, తులసి ఆకులు సహజసిద్ధమైన డికంజెస్టెంట్స్‌గా పనిచేస్తాయి. అంటే ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనాన్ని కలిగిస్తాయి. అలాగే తేనె గొంతులో కలిగే ఇరిటేషన్‌ను తగ్గిస్తుంది. కనుక ఈ మిశ్రమాన్ని తీసుకుంటే దగ్గు తగ్గుతుంది. జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే శ్వాసకోశ వ్యవస్థలో ఉండే శ్లేష్మం మొత్తం కరిగిపోతుంది. ముఖ్యంగా ఆస్తమా ఉన్నవారికి ఈ మిశ్రమం ఎంతగానో మేలు చేస్తుంది. వేపాకుల్లో యాంటీ బాక్టీరియల్ గుణాలు ఉంటాయి. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. తేనెలో మాయిశ్చరైజింగ్ గుణాలు ఉంటాయి. దీనివల్ల మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. చర్మానికి సహజసిద్ధమైన కాంతి వస్తుంది. ఇలా ఈ మిశ్రమాన్ని రోజూ తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో
# శ్రీకాంతా చారి వర్ధంతి
### విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించిన నేతలు



**ఆదిలాబాద్ :** తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతా చారి ఆత్మబలిదానం తెలంగాణా ఉద్యమంలో ఒక కీలక మలుపని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ అన్నారు. శ్రీకాంతా చారి 15వ వర్ధంతి సందర్భంగా స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆదిలాబాద్ బస్టాండ్ సమీపంలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. స్వరాష్ట్ర సాధనలో తెలంగాణ అమరవీరుల ఆత్మ బలిదానాలు చూసి చలించిన యూపీఏ చైర్ పర్సన్ కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర విభజనకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ లో పార్టీ కి భారీ నష్టం వాటిల్లుతుందని తెలిసినా తెలంగాణ ప్రజల సెంటిమెంటుకు గౌరవ మిచ్చి, ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన వారి ఆత్మకు శాంతి కలిగేలా స్వరాష్ట్రమిచ్చిన దేవత సోనియా గాంధీ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ అనంతరం ఏర్పడిన టీఆర్ఎస్ సర్కార్ ఉద్యమకారులకు విద్యార్థులకు అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు తగిన గౌరవమిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, సందా నర్సింగ్ , శ్రీలేఖ ఆదివాసీ, బూర్ల శంకరయ్య,దాసరి ఆశన్న,నరిగి ఆశన్నయాదవ్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ములుగు ఎన్‌కౌంటర్
## హైకోర్టు ఏం చెప్పిందంటే

**హైదరాబాద్, మహా:** ములుగు ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ములుగు ఎన్‌కౌంటర్ తదుపరి చర్యలు, పోస్టుమార్టం రిపోర్టును అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఎన్‌కౌంటర్‌పై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం మల్లయ్య మృతదేహాన్ని గురువారం వరకు భద్రపరచాలని ఆదేశించింది. మిగిలిన మృతదేహాలను కుటుంబసభ్యులకు అందించాలని చెప్పింది. తదుపరి విచారణను గురువారం (డిసెంబర్ 5)కు వాయిదా వేసింది. నిన్నటి విచారణలో ఈరోజు వరకు మృతదేహాలను భద్రపరచాలని హైకోర్టు ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. నేడు మరోసారి పిటిషనర్ తరపున, అలాగే ప్రభుత్వం తరపున వాదనలు కొనసాగాయి. అయితే మృతదేహాలపైన అనేక గాయాలు ఉన్నాయని, ఇదొక బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. భద్రపరిచిన మృతదేహాలకు రీ పోస్టుమార్టం నిర్వహించాలని పదే పదే కోరారు. మరోవైపు నిన్న హైకోర్టు ఆదేశాలు ఇచ్చిన సమయంలో పోస్టుమార్టం అంతా కూడా చీకటిలో నిర్వహించారని, పంచనామా ప్రక్రియ సరిగ్గా నిర్వహించలేదు కాబట్టి రీపోస్టుమార్టం చేసేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ తరపున న్యాయవాది వాదనలు వినిపించారు. అలాగే ప్రభుత్వం తరపున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. ఎన్‌హెచ్‌ఆర్సీ గైడ్‌లెన్స్ ప్రకారం, అలాగే హైకోర్టు ఆదేశాల మేరకే శవ పరీక్షలు పూర్తి చేశామని స్పష్టం చేశారు. కేవలం ఎదురు కాల్పుల్లో మాత్రమే మావోలు మృతి చెందారని ప్రభుత్వ తరపు న్యాయవాది తన వాదనలు వినిపించారు. ఎక్కడా కూడా ఇది బూటకపు ఎన్‌కౌంటర్ కాదని, ఆహారంలో ఎలాంటి విషం ఇవ్వలేదని న్యాయవాది స్పష్టం చేశారు. ఎనిమిది మంది వైద్య నిపుణులతో పోస్టుమార్టం పూర్తి చేశామని వాటికి సంబంధించి ఫోటోగ్రఫీ కూడా కోర్టుకు అందజేస్తున్నామని ప్రభుత్వం తరుపున న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. మృతదేహాలను భద్రపరిచనట్లైతే శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని.. అందుకే మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించేందుకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోరారు. అయితే మావోలకు భోజనంలో విషం కలిపారని, ఆపై కస్టడీలోకి తీసుకుని కాల్చిచంపారన్న అంశాన్ని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లగా.. పీఎంఈ రిపోర్టు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో వాదనలు వినిపించాలని హైకోర్టు చెప్పింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. కేవలం మల్లయ్య మృతదేహం తప్ప మిగిలిన మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.



పీఎంఈ రిపోర్టుతో పాటు ఎన్‌కౌంటర్ జరిగిన పరిణామాలకు సంబంధించిన రిపోర్టు, ఎన్‌కౌంటర్ తదుపరి చర్యలను న్యాయస్థానానికి అందజేయాలని హైకోర్టు ఆదేశించింది. గురువారం రోజు రాష్ట్ర ప్రభుత్వం ఆ నివేదికను ఇచ్చిన తరువాత తదుపరి చర్యలకు హైకోర్టు ఆదేశించే అవకాశం ఉంది. కేవలం పిటిషనర్‌గా మల్లయ్య భార్య ఉన్నందున.. ఆయన మృతదేహాన్ని తప్ప మిగిలిన మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది..

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం
### ఉత్సాహంగా సాగుతున్న ప్రజాపాలన విజయోత్సవాలు
### మూడోరోజు మున్సిపల్ ఆధ్వర్యంలో అర్బన్ డే కార్యక్రమాలు



**ఆదిలాబాద్ మహా :** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య కార్మికులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రజా పాలన విజయోత్సవల్లో భాగంగా మూడవ రోజు అర్బన్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పారిశుద్ధ్య కార్మికులకు పలు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాల చెక్కులను పంపిణీ చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన ఫుడ్ స్టాళ్లను పరిశీలించి వంటల ప్రదర్శనను తిలకించారు. పలు రకాల వంటకాల రుచి చూసి అభినందించారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ...పట్టణ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. వైద్య శిబిరంలో వైద్యులు సూచించిన సూచనలను పాటించాలని, మందులను క్రమం తప్పకుండా వాడాలన్నారు. కార్మికుల వేతనాలు పెండింగ్ లో ఉండకుండా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అదేవిధంగా మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, డీఎంహెచ్ ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్, ఇంచార్జ్ కమిషనర్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి- కలెక్టర్



### యాపల్‌గూడ పాఠశాలలో న్యూట్రిషన్ డే

**ఆదిలాబాద్ మహా :** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. యాపల్ గూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా మంగళవారం న్యూట్రిషన్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలాంటి మాదక ద్రవ్యాలు ముట్టుకోబోమని, అందరికీ అవగాహన కల్పిస్తామని పేర్కొంటూ విద్యార్థులు కలెక్టర్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. ప్రతిరోజు ఉదయం పాఠశాలకు వచ్చిన తర్వాత ప్రార్థన అనంతరం పది నిమిషాలు ఈ అంశాలపై నెమరువేసుకోవాలన్నారు. మొదటి ప్రాధాన్యతగా మనం చేసే వర్క్ పై శ్రద్ధ పెట్టాలన్నారు. పనిచేసే సమయంలో శ్రమ అనిపిస్తే కొంత సమయం విశ్రాంతి తీసుకోవాలన్నారు. ప్రోటీన్ విటమిన్ కార్బోహైడ్రేట్ ఫైబర్ వాటిని తినడం అలవర్చుకోవాలన్నారు. నీరు బాగా తాగాలన్నారు. ఇదంతా ఆరోగ్య పాఠశాలలో భాగమేనన్నారు. ప్రభుత్వం ఆదేశానుసారం ఒకరు హెడ్ గా ఇద్దరు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇందులో భాగస్వాములుగా ఉండి మానిటరింగ్ చేయాలన్నారు. ప్రతిరోజు వంటగది, సరుకులను భద్రపరిచే ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచాలన్నారు. సరుకులు పాడవకుండా సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం, స్టోర్ రూం, సరుకులు, తదితర వాటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, డీఎంహెచ్ఓ నరేందర్, శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు రాములు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బేలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్



**ఆదిలాబాద్ మహా :** బేల మండలంలో రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పోలీస్ లు పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ఐ దివ్యభారతి విలేకరుల సమావేశం లో మాట్లాడుతూ ఏ.ఎస్.ఐ జీవన్ కుమార్ సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రాత్రి సమయంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక టిప్పర్ పట్టుకొని పోలీస్ స్టేషన్ కి తీసుకొచ్చినట్టు ఆమె తెలిపారు. పట్టుకున్న సంబంధిత వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు. అలాగే బేల పోలీస్ స్టేషన్ కి నూతనంగా 8 మంది కానిస్టేబుళ్లు విధుల్లోకి చేరినట్టు పేర్కొన్నారు.

## వంతెన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



**నిర్మల్, మహా :** పంచాయతీరాజ్ శాఖ ద్వారా మంజూరైన 54 లక్షల రూపాయల నిధులతో చేపట్టనున్న దార్ కుభీర్ గ్రామ వంతెన నిర్మాణానికి ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మంగళవారం భూమి పూజ చేశారు. వంతెన సదుపాయం లేక ఎన్నో సంవత్సరాలుగా దార్ కుభీర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే అన్నారు. నిధులను మంజూరు చేసిన మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ధార్ కుబీర్ గ్రామ అభివృద్ధికి ఎల్లవేళలా పాటుపడతానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యా నైపుణ్యాలను పెంచండి



### ఆడే గజేందర్

**ఆదిలాబాద్ మహా :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాలను పెంచే విధంగా, వారిని అన్ని రంగాల్లో నిష్ణాతులు అయ్యేవిధంగా ఉపాధ్యాయులు బోధించాలని బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ అన్నారు. సోనాల మండల కేంద్రంలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేసారు. విద్యార్థులు పరిసరాలను తమకు అనుకూలంగా మార్చుకొని పట్టుదలతో విద్య నేర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యార్హతలు కలిగిన, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు బోధిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 500 కోట్లు కేటాయించిందని, మెగా డీఎస్సీ నిర్వహించి ఖాళీలను భర్తీ చేసి ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడుతోందని తెలియజేశారు, ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులు సెలవు దినాల్లో కూడా ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నందుకు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు

## ఏటీఎం లూటీకి స్కెచ్ వేసిన దొంగలు
### ధ్వంసం చేస్తుంగా మోగిన అలారం.. పరారైన గుర్తుతెలియని వ్యక్తులు
### సీసీ ఫుటేజీలో వీడియోలు రికార్డు.. కరణ్ కోట్ గ్రామంలో ఘటన

**తాండూరు, మహా :** ముఖానికి మాస్కులు ధరించిన గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం లూటీకి స్కెచ్ వేశారు. కరెంటు కనెక్షన్ కట్ చేసి చోరీ చేసేందుకు యత్నించారు. వెంటనే అలారం మోగడంతో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయి. ఈ సంఘటన కరణ్ కోట్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కరణ్ కోట్ గ్రామంలోని ఎస్బీఐ బ్యాంకుకు సంబంధించిన ఏటీఎంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ముఖానికి మాస్కులు ధరించి లోనికి ప్రవేశించారు. ఏటీఎం కరెంట్ కనెక్షన్ కట్ చేసి గడ్డపారలతో మిషన్‌ను ధ్వంసం చేసేందుకు యత్నించారు. అప్పటికే అలారం మోగడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. బ్యాంకు అధికారులకు నోటిఫికేషన్ రావడంతో వారు కరణ్ కోట్ పోలీసులకు సమాచారం అందించారు.

## శ్రీకాంతా చారి త్యాగాలను మరవకూడదు
### జనసేన నాయకులు



**నిర్మల్, మహా :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణ చేసుకున్న శ్రీకాంత చారి త్యాగాలను మరవకూడదని ఆయన త్యాగాలను స్మరించుకోవాలని జనసేన పార్టీ నిర్మల్ నాయకులు సుంకేట మహేష్ బాబు అన్నారు. భైంసా పట్టణంలోని డాక్టర్ లైన్ చౌరస్తా దగ్గర జనసేన పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాంత చారి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి అమరుడు శ్రీకాంత్ చారి అన్నారు. శ్రీకాంతా చారి జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆత్మార్పణం చేసుకున్న శ్రీకాంతా చారి త్యాగాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మరువరాదన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రహ్మణ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి రామోజివార్ గంగాప్రసాద్, సాయినాథ్, శ్రీనివాస్, ఫారుఖ్, సచిన్, విట్టల్ సింగ్, చిన్నన్న తదితరులు పాల్గొన్నారు..

## నిర్మల్‌లో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు




**నిర్మల్ మహా :** ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా 3వరోజు మున్సిపల్, జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 2 కే రన్ ను మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ జండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని మంచిర్యాల చౌరస్తా నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఈ రన్ కొన సాగింది.అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పాటు అయ్యి సంవత్సరకాలం పూర్తి చేసుకున్నందున ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రతి అధికారి జిల్లా అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అదనపు కలెక్టర్ పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డిఈఓ పి. రామారావు, డి వై ఎస్ ఓ శ్రీకాంత్ రెడ్డి, డిసిఓ రాజమల్లు, తహసిల్దార్ రాజు, గిరిజన క్రీడా అధికారి భుక్యా రమేష్, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

### పైసాలో డిజిటల్ లిమిటెడ్ 75 మిలియన్ డాలర్ల వరకు
# ఫండ్ రైజ్ ఆమోదం

PAISALO
EASY LOAN आसान लोन
PAISALO DIGITAL LIMITED

**హైదరాబాద్ 02 డిసెంబర్ 2024:** ఫైనాన్షియల్ రంగంలో స్థిరంగా ఎదుగుతున్న, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన పైసాలో డిజిటల్ లిమిటెడ్ (బిఎస్ఇ: 532900, ఎన్ఎస్ఇ: పైసాలో) బోర్డు 7.5% సెక్యూర్డ్ ఫారిన్ కరెన్సీ కన్వర్టిబుల్ బాండ్స్ (ఎఫ్ సిసిబిఎస్) ద్వారా 75 మిలియన్ డాలర్ల వరకు నిధులను సేకరించడానికి ఆమోదం తెలిపింది. ఈ బాండ్లు 5 ఏళ్ల గడువు కలిగి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన ఇసిబి మార్గదర్శకాలను అనుసరించనున్నాయి.

**ఆర్థిక ఫలితాలు:**

సెప్టెంబర్ 30, 2024 తో ముగిసిన త్రైమాసిక, అర్ధవార్షిక ఆర్థిక ఫలితాల ప్రకారం, కంపెనీ రూ. 45,352 Mn ఆస్తుల నిర్వహణ (ఏయుఎం)తో 19% వృద్ధి సాధించింది. రెవెన్యూ 33% వృద్ధితో Rs. 3,736 ఎంఎన్ కి చేరుకుంది. నికర లాభం 6% వృద్ధితో Rs. 914 ఎంఎన్గా నమోదైంది.

**వృద్ధి లక్ష్యాలు:**

కంపెనీ వ్యయాలను తగ్గిస్తూ, జెన్ఏఐ సాంకేతికతను అన్వయించుకొని, ఉత్పాదకతను పెంచడంపై దృష్టి పెడుతోంది. జిఎన్ పిఏ, ఎన్ఎన్ పిఏలు వరుసగా 0.86% మరియు 0.61%*గా ఉండగా, దీర్ఘకాలంలో అవి 2% కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.

**వ్యాపార మార్పిడి దశ:**

"వ్యాపార మార్పిడి ఫేజ్ 2 ప్రగతిలో ఉంది. ఈ దశను స్థిరపరిచేందుకు వచ్చే రెండు త్రైమాసికాల పాటు మనం దృష్టి సారిస్తాము," అని కంపెనీ పేర్కొంది.పైసాలో డిజిటల్ లిమిటెడ్ 42 లక్షల మంది కస్టమర్లకు సేవలందించి, 2455 బ్రాంచ్‌ల నెట్‌వర్క్‌తో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విశ్వాసం సంపాదించింది.

## ఆర్టీసీలో ఆహ్లాదంగా వన భోజన మహోత్సవం
### క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం
### ఉత్సాహంగా పాల్గొని సందడి చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు



**ఆదిలాబాద్ మహా :** పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వన భోజన మహోత్సవం ఉత్సాహంగా సాగింది. ఆర్టీసీ ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహల వాతావరణం నెలకొంది. ప్రతి ఏటా మాదిరిగానే ఈ సంవత్సరం సైతం డిపో ప్రాంగణంలో వన భోజన మహోత్సవాన్ని నిర్వహించారు. రీజనల్ మేనేజర్ సోలోమాన్, డిఎం కల్పనతోపాటు పలువురు అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. ఉద్యోగులంతా సరదాగా కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ.... ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి చక్కటి వాతావరణంలో వన భోజన మహోత్సవాన్ని నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. రెండురోజుల పాటు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉద్యోగుల్లో స్నేహభావం పెరగడంతోపాటు విధుల్లో బిజీగా ఉండే వారంతా ఉల్లాసంగా గడిపేందుకు వీలు చిక్కుతుందని తెలిపారు.

## ఏజన్సీ ఏరియాలో పేదలకు దుప్పట్ల పంపిణీ



**ఆదిలాబాద్ మహా :** షిర్డీ సాయి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఏజన్సీ ఏరియాలో పేదలకు స్వెట్టర్లు , దుప్పట్ల పంపిణీ చేసారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చలి తీవ్రత ఎక్కువగా ఉండే కొండ ప్రాంతాలు, గిరిజన గూడాలు బోరింగ్ గూడ , సాలే గూడ ప్రాంతాలను సందర్శించారు. చలికి అక్కడి గిరిజనులు పడుతున్న ఇబ్బందులు చూసి వారికి స్వెట్టర్ లు, దుప్పట్లు , చీరలు ,యువకులకు టీషర్ట్స్ అందచేసారు. ఈ కార్యక్రమంలో సాయి వృద్ధాశ్రమం మేనేజర్ పసుపుల రాజు , ప్రముఖ నాయ వాది శ్రావణ నాయక్ పాల్గొన్నారు.

# పినపాక కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలు

**ఓ సామాజిక వర్గాన్ని ఎమ్మెల్యే పక్కన పెడుతున్నారని ఆరోపణ**

**పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించట్లేదని మొహం చాటేసిన నేతలు**

**ఎమ్మెల్యే పై గుర్రుగా ఉన్న సీనియర్ నాయకులు**

**యువ నేతలకు ప్రాధాన్యమిస్తున్న ఎమ్మెల్యే పాయం**

**స్థానిక సంస్థల ఎన్నికలపై కన్నేసిన వ్యతిరేకవర్గం**

**గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రత్యేక వ్యూహాలు**



**మణుగూరు, డిసెంబర్ 03, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారింది. గత 2023 అసెంబ్లీ ఎన్నికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం మినహా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవ సంబరాలను కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. అదే ఉత్సాహంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుండే గెలుపే లక్ష్యంగా ప్రత్యేక వ్యూహాలను రచిస్తున్నారు. పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కొత్త పంథాలో అడుగులు వేస్తూ తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. తను కాంగ్రెస్ పార్టీలో చేరినప్పుడు తన వెంట ఉన్న నాయకులను పక్కకు పెట్టి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ శ్రమించి పార్టీ కోసం పని చేసినవారికి ప్రాధాన్యమిస్తూ ముందుకు వెళ్తున్నారు. ఆయన వెంట తిరిగినవారికి ప్రాధాన్యం ఇవ్వట్లేదని పలు ఆరోపణలు వస్తున్నప్పటికీ తనదైన శైలిలో రాజకీయాలకు కొత్త రూపం తెస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు సర్వసాధారణగం అయినప్పటికీ ఆ విషయాలను పక్కకు పెట్టి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకత్వం సూచన మేరకు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నారు.

**ఓ సామాజిక వర్గాన్ని పక్కన పెడుతున్నారని ఆరోపణ**

పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు విజయం సాధించుటప్పటి నుండి ఓ సామాజికవర్గ నాయకులను పక్కన పెడుతున్నారనే అపవాదులు మూట కట్టుకుంటున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఎటువంటి అధికారిక కార్యక్రమాలకు వారిని ఆహ్వానించడం లేదని కొందరు సీనియర్ లు గుర్రుగా ఉన్నారని పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సోమవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవాల్లో ఆ నేతలు ఎవరు కనబడకపోవడంతో రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఆయన వెంట ఉండి గెలుపు కోసం శ్రమిస్తే చివరకు మమ్మల్ని కూడా పక్కకు పెట్టారని కొందరు నేతలు అసంతృప్తితో ఉన్నారని తెలుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారి సత్తా చూపించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. అయితే పాయంపై వ్యతిరేకతగా ఉన్నవారిని కలుపుకొని, పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు వారు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే కొందరు నేతలు బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### స్థానిక సంస్థల ఎన్నికలే వారి టార్గెట్..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. గతంలో భారత కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ కలిసి కూటమిగా పని చేశాయి. ఈసారి జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వారి పొత్తు కొనసాగుతుందా అనేది వేచి చూడాలి. అదే జరిగితే పినపాక నియోజకవర్గంలో కూటమి మరోసారి విజయం సాధిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గతంలో జరిగిన రాజకీయాలను బేరిజు వేసుకుంటే గులాబీ పార్టీ స్థానాలు గెలుచుకోవడం కష్టమేనని తెలుస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల ముందు గులాబీ దళం ప్రజల్లో వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఆ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీ ఓటమిపాలైంది. అలా కాకుండా ప్రభుత్వ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకువెళ్తే మరింత మెరుగైన స్థానాలు గులాబీ పార్టీకి వచ్చే అవకాశాలు లేకపోలేదు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తుండడంతో అన్ని పార్టీల నేతలు ముందస్తు ప్రణాళికలు రచించుకుంటున్నారు.

# అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే ఆరోణలు

**చైర్ పర్సన్ పదవి పొంగిలేటి భిక్ష**

**జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దేవిప్రసన్న**



**కొత్తగూడెం, డిసెంబర్ 3 మహా:** ప్రజా పాలనపై అక్కసుతోనే కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి విమర్శిస్తున్నారని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి పాలనకు ప్రజలు చరమగీతం పాడి కాంగ్రెస్ ప్రజాపాలకు పట్టం కట్టారని స్పష్టం చేశారు. చైర్‌పర్సన్ ఇంకా అధికార భ్రాంతిలోనే బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పానలను విమర్శించడంపై స్పందిస్తూ మంగళవారం చుంచుపల్లి మండలంలోని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ తనపై ఉన్న అవినీతి ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకు అసత్యాలు ప్రచారం చేస్తూ స్థాయి మరిచి మాట్లాడుతూన్నారని, నేడు అనుభవిస్తున్న పదవి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పెట్టిన భిక్ష అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అభివృద్ధి కంటే అవినీతి ఎక్కువగా జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పిస్తుంటే ఓ మహిళ అయ్యి కూడా వ్యంగ్యంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు. అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అడుగడుగునా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అధికారం చేపట్టినప్పటి నుండి వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారని, స్వలాభం కోసం మున్సిపాలిటీలో స్వార్థ రాజకీయాలకు తెరలేపిన ఘనత చైర్‌పర్సన్‌కు దక్కుతుందన్నారు. పట్టణ అభివృద్ధిని పక్కకుపెట్టి కౌన్సిల్‌లో గ్రూపు తగాదాలతోనే కాలయాపన చేశారని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలను విమర్శిస్తే సహించేది లేదని, భవిష్యత్తులో పునరావృతం అయితే తగిన గుణపాటం చేబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బాలిశెట్టి సత్యభామ, తొగరు రాజనళిని, రైల్వే సెంట్రల్ బోర్డు మెంబర్ వై శ్రీనివాస్ రెడ్డి, తలుగు అనీల్, నాయకులు బాలిశెట్టి సుందర్ రాజ్, పవన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్‌పై సమగ్ర దర్యాప్తు

**ఆదేశించిన కలెక్టర్ దివాకర.. ఎంక్వైరీ ఆఫీసర్‌గా ఆర్డీవో**

**ములుగు, డిసెంబర్ 3, మహా:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సమగ్ర విచారణ జరపాలని కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాలు జారీ చేశారు. అందుకుగాను ఎంక్వైర్ ఆఫీసర్ గా ఆర్డీవోను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు. చిట్యాల రిజర్వు ఫారెస్ట్ పరిధిలోని చెల్పాక అడవుల్లో డిసెంబర్ 1న పోలీసులు, మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే ఏటూరునాగారం డీఎస్పీ రిఫరెన్స్‌తో ఆ ఎన్‌కౌంటర్‌పై విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ ఉత్వర్వులు వెలువరించారు. ములుగు ఆర్డీవో, సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ను విచారణ అధికారిగా నియమించారు. నెలరోజుల వ్యవధిలో పూర్తి విచారణ జరిపి సమగ్ర నివేదికను రికార్డులతో సహా తనకు నివేదించాలని ఆదేశించారు.

# కుటుంబ సభ్యులకు మృతదేహాలు అప్పగింత

**ములుగు ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో విచారణ**

**సమగ్ర నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశం**

**మల్లయ్య మృతదేహాన్ని భద్రపరచాలని పోలీసులకు ఆదేశం**

**రీ పోస్ట్‌మార్టం నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరిన పిటిషనర్లు**

**మృతదేహాలను మావోయిస్టుల కుటుంబ సభ్యులకు అభ్యంతరంలేకపోతే అప్పగించాలని ఆదేశం**

**తదుపరి విచారణ ఈ నెల 5కు వాయిదా**



**ములుగు, డిసెంబర్ 3, మహా:** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ లో మృతిచెందిన ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలను మంగళవారం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏటూరు నాగారం సామాజిక ఆసుపత్రిలో పోలీసుల సమక్షంలో వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మార్చురీ గదిలోనే భద్రపరిచారు. మంగళవారం మృతిచెందిన మావోయిస్టు కుర్సం మంగు అలియాస్ భద్రు మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం డీఎస్పీ ఎన్. రవీందర్, సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్లు భద్రు సోదరుడు కురుసం సోమకు అప్పగించారు. వారు ఛత్తీస్ గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఇర్పునర్ గ్రామానికి తీసుకెళ్లారు. అదేవిధంగా జమున మృతదేహాన్ని ఆమె చిన్నాన ముష్కి లక్ష్మణ్ కి అప్పగించారు. కర్ణాకర్, కామేష్ మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించగా కుటుంబ సభ్యులు ఛత్తీస్ గఢ్ తీసుకెళ్లారు. కిషోర్, జైసింగ్ లకు సంబంధించిన బంధువులు ఎవరూ రాకపోవడంతో వారి మృతదేహాలను మార్చురీ గదిలోనే భద్రపరిచారు. పెద్దపెల్లికి చెందిన మల్లయ్య అలియాస్ మధు మృతదేహంను ఈనెల 5వతేదీ వరకు రాష్ట్ర హైకోర్టు తీర్పు మేరకు ఫ్రీజర్ లో భద్రపరిచారు. మల్లయ్య మృతదేహానికి రీపోస్టుమార్టం నిర్వహించాలని మృతుని బంధువులు వేసిన పిటీషన్ మేరకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పోలీసు అధికారులు సైతం చర్యలు తీసుకున్నారు. కాగా, కలెక్టర్ దివాకర చల్పాక ఎన్‌కౌంటర్ పై సమగ్ర విచారణ చేయాలని ప్రత్యేక అధికారిగా ఆర్డీవోను నియమించడం గమనార్హం.

# ములుగును అవినీతి రహిత జిల్లాగా మార్చుదాం

**డిసెంబర్ 3 నుండి 9 వరకు వారోత్సవాలు**




**ములుగు, డిసెంబర్ 3, మహా:** ములుగు జిల్లాను అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ అవినీతి నిరోధక శాఖకు సహకరించాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో అవినీతి నిరోధక వారోత్సవాల కర పత్రము, పోస్టర్, టోల్ ఫ్రీ నెంబర్ ను ఏసీబీ సీఐతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అవినీతిని తరిమేసి దేశాన్ని అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ములుగు జిల్లాను అవినీతి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలు ఏసీబీ అధికా రులకు సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో డిసెంబర్ 3 నుండి 9 వరకు అవినీతి నిరోధక వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా లంచం అడిగితే ఇవ్వవద్దని, లంచం ఇవ్వాలని అడిగితే ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు లేదా వరంగల్ రేంజ్ ఏసీబీ ఫోన్ నెంబర్ 9154388912 కు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్, వరంగల్ రేంజ్ ఏసీబీ సీఐ రాజు, ఇతర అధి కారులు, తదితరులు పాల్గొన్నారు.

# అటవీ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



**మంగపేట, డిసెంబర్ 03, మహా:** మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో మండల అటవీ శాఖ డిప్యూటీ రెంజర్ పి. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అటవీ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు, వాటిని నివారించే చర్యల గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకునే చర్యల గురించి గ్రామాలలో ప్రజలకు వివరించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో బీట్ అధికారులు ప్రశాంత్ కుమార్, శ్రీలత, బేస్ క్యాంపు సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న కర్ర పట్టివేత



**ములుగు, డిసెంబర్ 3, మహా:** ఎడ్లబండ్లలో అక్రమంగా కలప తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్వో డోలి శంకర్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం బండ్లపాడు సమీపంలో కాపు కాయగా ఐదు ఎడ్లబండ్లలో ఏడు బిలుగు దిమ్మలు లభ్యమయ్యాయని, ఎడ్లబండ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా భూపాలపల్లి జిల్లా దూదేకులపల్లి నుంచి వెంకటేశ్వర్లపల్లికి ఆ దిమ్మలను తరలిస్తున్నట్లు వెల్లడించారని తెలిపారు. వాటి విలువ రూ. 1.5 లక్షలు ఉంటుందని ఎఫ్ఆర్వో శంకర్ పేర్కొన్నారు. అక్రమంగా కలప తరలిస్తున్న రజాకార్, రాజు, రమేష్, లచ్చుమల్లు, శంకర్ లను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ యాకూబ్ జానీ, ఎఫ్బీవోలు రంజిత్, హనుమంతు, రాజేశ్వరి, శివశంకర్, రాజేష్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో 2కే రన్




**కొత్తగూడెం, డిసెంబర్ 3, మహా:** ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ అంబేద్కర్ సెంటర్ నుండి రైల్వే స్టేషన్ ఎంజీ రోడ్ వరకు మంగళవారం 2కే రన్ నిర్వహించారు. కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, మున్సిపల్ అధికారులు సిబ్బంది, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, విద్యాశాఖ, విద్యుత్ శాఖ, అధికారులు, సిబ్బందితో పాటు పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు. 2కే రన్ లో ముందుగా చేరుకున్న ముగ్గురు బాలికలకు, బాలురలకు, అలాగే పాల్గొన్న పాఠశాలలకు అడిషనల్ కలెక్టర్ చేతుల మీదుగా మెమోంటోలను అందించారు.

# అవినీతి వ్యతిరేక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**కొత్తగూడెం, డిసెంబర్ 3, మహా:** ఈ నెల 9న అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా శనివారం నుంచి వారం రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి వ్యతిరేక వారోత్సవాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో అవినీతి నిరోధక శాఖకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మంగళవారం ఆయన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వై. రమేష్, ఇన్స్పెక్టర్ ఎన్. శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో డేటా ఎంట్రీని పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, డిసెంబరు 03, మహా:** రెండు రోజుల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే, సీఎం కప్, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక తదితర విషయాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలసి జిల్లాలోని ఆర్డీవోలు, తహశీల్దార్ లు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులతో ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీలో రాష్ట్రస్థాయిలో వెనుకబడి ఉన్నామని అసహనం వ్యక్తం చేశారు. రానున్న రెండు రోజుల్లో వంద శాతం కుటుంబ సర్వే డేటా ఎంట్రీ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. దానికి గాను డే అండ్ నైట్ షిఫ్ట్ ల లో డేటా ఎంట్రీ ప్రక్రియ చేపట్టాలని, అందరూ ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు నిరంతరంగా పర్యవేక్షిస్తూ పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఉచితంగా కంటి పరీక్షలు: జీఎం



**మణుగూరు, డిసెంబరు 03, మహా:** సింగరేణి యాజమాన్యం తమ వంతు సామాజిక బాధ్యతలో భాగంగా మణుగూరు ఏరియాలోని ప్రాజెక్ట్ ప్రభావిత మరియు పరిసర 25 గ్రామాలకు చెందిన నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరంలో డా. శేషగిరి రావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆప్తామాలజిస్ట్ సంజీవ రావు కంటి పరీక్షలు నిర్వహించారు. 29 మంది నేత్ర పేషెంట్లను ఈ నెల 5న సికింద్రాబాద్ పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ప్రభుత్వవైద్య విభాగం సౌజన్యంతో ఉచితంగా ఆపరేషన్లు చేయడం జరుగుతుందని, గ్రామస్తులకు ఉచితంగా రవాణా, భోజన సౌకర్యం కూడా కల్పించబడుతుందని ఏరియా జీఎం దుర్గం రామచందర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీవై సీఎంఓ మేరీ కుమారి, సింగరేణి ఆసుపత్రి మాట్రిన సారహ్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి



**చర్ల, డిసెంబర్ 3, మహా:** చర్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాయి నగర్ లో ఉన్న డంపింగ్ యార్డ్ ను వెంటనే తొలగించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం సాయి నగర్ లోని డంపింగ్ యార్డ్ ను సందర్శించి ఆయన మాట్లాడారు. జనావాసాల చుట్టూ డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేసి దానిని కాల్చిన అప్పుడల్లా వచ్చే పొగ వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని, నివాసాలకు దూరంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలని అన్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని తెలిపారు. డంపింగ్ యార్డ్ కారణంగా అనేక శ్వాసకోస జబ్బులు వస్తున్నాయని, ప్రజల ఆరోగ్యాలతో ప్రభుత్వ అధికారులు చెలగాటం ఆడడం సరికాదని ఆయన హెచ్చరించారు. లేకపోతే పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి దశలవారీగా పోరాటాలకు సైతం వెనకాడబోమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పొడుపుకంటి సమ్మక్క, దొడ్డి హరినాగ వర్మ, తమరు బాలాజీ, సాయి నగర్ శాఖ కార్యదర్శి దున్నా శివ సాయి, సీపీఎం పార్టీ సభ్యులు కటం కృష్ణ, జంజీరాల భద్రయ్య, చల్ల పుల్లారావు, కేశవులు, నాగయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.

# ములుగులో గీత కార్మికుల ర్యాలీ

**హామీలు అమలు చేయాలని డిమాండ్**




**ములుగు, డిసెంబర్ 3, మహా:** ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేయాలని, ప్రతీ గీత కార్మికునికి బైక్ ఇవ్వాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ, నాన్ ఏజెన్సీ తేడా లేకుండా వృత్తిపని చేసేవారందరికీ సేఫ్టీ మోకులు అందించాలన్నారు. కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ములుగులోని ఏరియా ఆస్పత్రి నుంచి డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు రమణగౌడ్ మాట్లాడారు. తెలంగాణలో పదేళ్ల ప్రయాణం కల్లుగీత వృత్తి ఉపాధి అంశంపై మాట్లాడారు. గీత వృత్తిలో ఉపాధి మెరుగు పడాలంటే ప్రధానంగా చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని, కల్లుకు మార్కెట్ సౌకర్యం కల్పించాలని, నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రకృతి పానీయంగా స్వచ్ఛమైన కల్లు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైందని పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనంలో గత ప్రభుత్వ హయాంలో నీరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి రూ. 8 కోట్ల బడ్జెట్ కేటాయించడం జరిగిందని, బిల్డింగ్ నిర్మాణం పూర్తయిందని, అందుకు సంబంధించిన మిషనరీని నిర్మాణం చేశారన్నారు. కోట్ల రూపాయలతో నిర్మించిన భవనం, మిషనరీ నేడు పడావు పడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన నిధులు కేటాయించి ఆ కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కల్లు గీత వృత్తి చేసే వారందరికీ సేఫ్టీ కిట్లు ఇవ్వాలని అన్నారు. పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని కోరారు. కేజీకేఎస్ జిల్లాప్రధాన కార్యదర్శి గుండెబోయిన రవి గౌడ్ మాట్లాడుతూ జిల్లాలో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ఏరియాలో సొసైటీలు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సుప్రజ హాస్పటల్ ఎండీ శిగ విజయ్ కుమార్ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న మెమోరియల్ ట్రస్టు చైర్మన్ తాళ్లపల్లి రామస్వామి, జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, గొల్ల పల్లి రాజేందర్, ముస్నిపల్లి కుమార్, కక్కెర్ల అశోక్, కూనూర్ అశోక్, రంగు సత్యనారాయణ, బోనగాని సారయ్య, గడ్డం శ్రీధర్, రాజమౌళి, లోడే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంకా ప్రజల వద్దే రూ.6,839 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు : ఆర్బీఐ

ఇంకా రూ.6,839 కోట్ల విలువైన రూ.2000 నోట్లు చలామణిలో ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Reserve Bank of India) తాజాగా ప్రకటించింది. 2023 మే 19న రూ.2000 నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. నాటి నుంచి నవంబర్‌లో వ్యాపారం ముగిసే సమయానికి చలామణి నుంచి దాదాపు 98.08 శాతం మేర రూ.2వేల నోట్లు (Rs 2,000 Notes) తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని తెలిపింది. ప్రస్తుతం రూ.6,839 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్ద ఉన్నాయని, అవి రావాల్సి ఉందని స్పష్టం చేసింది. కాగా, 2023 మే 19న చలామణి నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. నాడు చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ రూ.3.56లక్షల కోట్లు. ఇదిలావుంటే నిరుడు అక్టోబర్ 7దాకా దేశంలోని అన్ని బ్యాంక్ శాఖల్లో రూ.2,000 నోట్ల మార్పిడి జరిగింది. ఆ తర్వాత నుంచి హైదరాబాద్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మాత్రమే ఈ మార్పిడికి వీలుంది. అహ్మదాబాద్, బెంగళూరు, బేలాపూర్, భోపాల్, భువనేశ్వర్, చండీగఢ్, చెన్నై, గౌహతి, హైదరాబాద్, జైపూర్, జమ్మూ, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, ముంబై, నాగ్‌పూర్, న్యూఢిల్లీ, పాట్నా, తిరువనంతపురంలోని ఆర్బీఐ శాఖల్లో రూ.2వేల నోట్లు మార్చుకోవచ్చు. కాగా, కేంద్ర ప్రభుత్వం నవంబర్ 2016లో రూ.2000 నోట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అప్పుడు చలామణిలో ఉన్న రూ. 1,000, రూ.500 నోట్లను రద్దు చేసి రూ.2వేల నోట్లను చలామణిలోకి తెచ్చింది.





## లాభాల్లో స్టాక్ మార్కెట్లు..
### రెండు శాతంపైగా పెరిగిన పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు..

భారతీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పవనాలతో పాటు మీడియా, పీఎస్‌యూ బ్యాంక్, బ్లూ చిప్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతుతో లాభాల్లోకి దూసుకెళ్లాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ పాయింట్ల వద్ద 80,529.20 లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,244.78 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 80,949.10 వరకు పెరిగింది. చివరకు 597.67 పాయింట్ల లాభంతో 80,845.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 181.10 పాయింట్లు పెరిగి.. 24,457.15 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,647 షేర్లు పురోగమించగా.. 1,190 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో అదానీ పోర్ట్స్, ఎన్‌టీపీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ టాప్ గెయినర్స్ నిలిచాయి. భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హీరో మోటోకార్ప్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సన్ ఫార్మా నష్టపోయాయి. సెక్టార్లలో ఎఫ్ఎంసీజీ మినహా, మీడియా, పీఎస్‌యూ బ్యాంక్ సూచీలు ఒక్కొక్కటి రెండు శాతానికిపైగా పెరిగాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కో శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి.




## సిగరెట్లు, పొగాకు ధరలు!


**న్యూఢిల్లీ, డిసెంబర్ 2:** సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులతోపాటు శీతలపానియాల ధరల మరింత పెరగబోతున్నాయి. జీఎస్టీ పన్నురేటు హేతుబద్ధీకరణలో భాగంగా ప్రస్తుతం వీటిపై విధిస్తున్న 28 శాతం జీఎస్టీని 35 శాతానికి పెంచాలని బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరీ అధ్యక్షతన సోమవారం జీవోఎం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నది. జీవోఎం నిర్ణయానికి అనుగుణంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ ఈ నెల 21న సమావేశమైన తుది నిర్ణయం తీసుకోనున్నది. వీటితోపాటు దుస్తులపై పన్నును సవరించింది. రూ.1,500 లోపు రెడీమేడ్ గార్మెంట్‌లపై 5 శాతం పన్ను విధించనుండగా, అలాగే రూ.1,500 నుంచి రూ.10 వేల లోపు రెడీమేడ్ గార్మెంట్‌లపై 18 శాతం, రూ.10 వేలకు పైబడి గార్మెంట్‌లపై 28 శాతం విధించాలని జీవోఎం సూచించింది. కొత్తగా 148 ఉత్పత్తులపై పన్ను విధించాలని జీవోఎం సూచించగా, దీనిపై జీఎస్టీ నిర్ణయం తీసుకోనున్నది.

### కొత్తగా 35 శాతం

ప్రస్తుతం జీఎస్టీ పన్నుల్లో నాలుగు స్లాబ్‌లు ఉండగా, కొత్తగా 35 శాతం రేటును కూడా చేర్చాలని జీవోఎం సూచించింది. కొత్త స్లాబ్‌లో పొగాకు, ఇందకు సంబంధించిన ఉత్పత్తులతోపాటు శీతలపానియాలు చేర్చాలని పేర్కొంది. ప్రస్తుతం 5, 12, 18,28 శాతం రేట్లలో పన్నులు విధిస్తున్నది. లగ్జరీ ఉత్పత్తులైన కార్లు, వాషింగ్ మెషిన్లు, పొగాకు ఉత్పత్తులు 28 శాతం స్లాబ్‌లో ఉన్నాయి.

## రూ.79 వేలకు బంగారం.. వెండి మెరుపులు ఇలా..!

దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా రెండో రోజు తులం బంగారం (24 క్యారట్లు) ధర తగ్గింది. మంగళవారం తులం బంగారం ధర రూ.200 తగ్గి రూ.79 వేలకు చేరుకున్నది. సోమవారం 99.9 శాతం బంగారం తులం ధర రూ.79,200 వద్ద నిలిచింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.200 పతనమై రూ.78,600లకు చేరుకున్నది. మరోవైపు కిలో వెండి ధర మంగళవారం రూ.2,400 వృద్ధి చెంది రూ.92,400 వద్ద స్థిర పడింది. ఇండస్ట్రీయల్ మార్కెట్ నుంచి గిరాకీ రావడంతో వెండికి డిమాండ్ పెరిగిందని బులియన్ మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో తులం బంగారం ఫిబ్రవరి డెలివరీ ధర రూ.146 వృద్ధితో రూ.76,833 పలికింది. కిలో వెండి ధర రూ.1,251 పెరిగి రూ.92,061 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్‌లో ఔన్స్ బంగారం ధర 7.40 డాలర్లు పుంజుకుని 2,665.90 డాలర్లు పలికింది. ఔన్స్ వెండి ధర 1.93 శాతం పెరిగి 31.46 డాలర్లకు చేరుకుంది. ద్రవ్యోల్బణం తగ్గడంతోపాటు అమెరికాలో లేబర్ మార్కెట్ స్థిరంగా కొనసాగుతుండటంతో డిసెంబర్‌లో వడ్డీరేట్లు తగ్గే అవకాశాలు ఉన్నాయని యూఎస్ ఫెడ్ రిజర్వ్ చైర్మన్ క్రిస్టోఫర్ వాలర్ తెలిపారు.



# క్రీడా వార్తలు | SPORTS NEWS



## 5.5 ఓవర్లు.. 10 మెయిడిన్లు...
### బంగ్లాపై వెస్టిండీస్ పేసర్ సీల్స్ కిరాక్ స్పెల్

**జమైకా:** బంగ్లాదేశ్‌తో స్వదేశంలో జరుగుతున్న రెండో టెస్టులో వెస్టిండీస్ పేసర్ జేడన్ సీల్స్ (4/5) అద్భుత స్పెల్‌తో పర్యాటక జట్టు విలవిల్లాడింది. సీల్స్‌తో పాటు షమర్ జోసెఫ్ (3/49) రాణించడంతో మొదటి ఇన్నింగ్స్‌లో బంగ్లా 164 పరుగులకు ఆలౌట్ అయింది. షద్మాన్ ఇస్లామ్ (64), కెప్టెన్ మెహది హసన్ మిరాజ్ (36) బంగ్లా పరువు నిలిపారు. కాగా టెస్టు క్రికెట్ చరిత్రలో 46 ఏండ్ల తర్వాత సీల్స్ (15.5 ఓవర్లు, 10 మెయిడిన్లు.. 5 పరుగులు.. 4 వికెట్లు) అత్యంత పొదుపైన స్పెల్‌ను నమోదు చేశాడు. విండీస్ రెండో రోజు ఆట ముగిసే సరికి 70/1 స్కోరు చేసింది.

## బుమ్రా దిగ్గజ పేసర్..
### అతడిని ఎదుర్కోవడం కఠిన సవాల్ : ట్రావిస్ హెడ్



అడిలైడ్: ప్రపంచ క్రికెట్ చరిత్రలో జస్‌ప్రీత్ బుమ్రా దిగ్గజ పేసర్ అని ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రావిస్ హెడ్ అన్నాడు. అతడి బౌలింగ్‌ను ఎదుర్కొన్నానని తాను తన మనుమలు, మనుమరాళ్లతో గర్వంగా చెప్పుకుంటానని తెలిపాడు. 'క్రికెట్ చరిత్రలో దిగ్గజ ఫాస్ట్ బౌలర్ల జాబితాలో బుమ్రా కచ్చితంగా ఒకడిగా నిలుస్తాడు. అతడిని ఎదుర్కోవడం కఠిన సవాల్‌తో కూడుకున్నది. నా కెరీర్ ముగిసిన తర్వాత బుమ్రా వంటి పేసర్‌ను ఎదుర్కొన్నానని భవిష్యత్‌లో నా వారసులతో చెప్పుకుంటా' అని హెడ్ కొనియాడాడు



## డిసెంబర్ 22న.. పెళ్లి పీటలెక్కనున్న సింధు

హైదరాబాద్: ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు త్వరలోనే పెళ్లి పీటలెక్కనున్నది. రెండేండ్ల బీడబ్ల్యూఎఫ్ టైటిల్ నిరీక్షణకు రెండ్రోజుల క్రితమే ముగిసిన సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ టోర్నీతో తెరదించిన సింధు.. ఈ నెల 22న వివాహ బంధంలోకి అడుగుపెట్టనుంది. డిసెంబర్ 22న ఉదయ్‌పూర్(రాజస్థాన్)లో హైదరాబాద్‌కు చెందిన ఐటీ ప్రొఫెషనల్ వెంకట దత్తసాయితో ఆమె పెళ్లి జరుగనుంది. హైదరాబాద్‌లోని పొసిడెక్స్ టెక్నాలజీస్‌లో వెంకట దత్త సాయి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. డిసెంబర్ 24న హైదరాబాద్‌లో హెచ్ఐసీసీ వీరి రిసెప్షన్‌ను నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

## రేసు రసవత్తరం
### డబ్ల్యూటీసీలో మారిన ఫైనల్ సమీకరణాలు
### భారత్‌కు మెరుగైన అవకాశాలు.. ఐదు జట్ల మధ్య తీవ్ర పోటీ



**ముంబై:** వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 202325 సైకిల్‌లో టెస్టులు ముగుస్తున్న కొద్దీ ఫైనల్ రేసు మరింత రసవత్తరమవుతోంది. టాప్2లో నిలిచేందుకు ఏకంగా ఐదు జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరో 15 టెస్టులు మిగిలున్న ఈ సైకిల్‌లో ఇప్పటి వరకూ ఏ ఒక్క జట్టూ ఫైనల్ బెర్తును ఖాయం చేసుకోలేదు. ప్రస్తుతం టీమ్ఇండియా అగ్రస్థానంలో కొనసాగుతున్నప్పటికీ రాబోయే టెస్టులలో గెలవడం ఆ జట్టుకు కీలకం. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, శ్రీలంక, న్యూజిలాండ్.. ఫైనల్ బెర్తు కోసం పోటీ పడుతున్నాయి. భారత్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన కివీస్.. స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను ఓడటం.. పెర్త్ టెస్టులో భారత్ భారీ విజయం, దక్షిణాఫ్రికా.. శ్రీలంకను చిత్తుగా ఓడించిన నేపథ్యంలో ఫైనల్ సమీకరణాలు మళ్లీ మారాయి.

### భారత్‌కు మంచిదే..

స్వదేశంలో కివీస్ చేతిలో క్లీన్‌స్వీప్ ఎదుర్కొని ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లే ముందు డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే భారత్ కచ్చితంగా 40తో సిరీస్‌ను గెలవాల్సిన పరిస్థితి. కానీ పెర్త్ టెస్టులో 295 పరుగుల తేడాతో గెలిచి రోహిత్ సేన డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో మళ్లీ 61.11 శాతంతో అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. ఈ సైకిల్‌లో మరో 4 మ్యాచ్‌లు ఆడనున్న భారత్.. సిరీస్‌ను 41, 30తో గెలిచినా.. 22తో డ్రా అయినా ఫైనల్ చేరే అవకాశాలున్నాయి. ఆస్ట్రేలియాను 30తో ఓడిస్తే భారత్.. 62.28 పాయింట్లతో డబ్ల్యూటీసీని ముగిస్తుంది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 22తో డ్రా అయినా టీమ్ఇండియా ఫైనల్ చేరుతుంది. అయితే ఇలా జరగాలంటే శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌ను దక్షిణాఫ్రికా 20తో గెలవాలి. ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను శ్రీలంక.. 10తో గెలిస్తే భారత్ మూడోసారి ఫైనల్ చేరడానికి ఆస్కారముంటుంది.

### రేసులోకి వచ్చిన సఫారీలు..

దర్బన్ టెస్టులో లంకను చిత్తుచిత్తుగా ఓడించడం దక్షిణాఫ్రికాకు కలిసొచ్చింది. ప్రస్తుతం ఆ జట్టు భారత్ తర్వాత 59.26 శాతం పాయింట్లతో రెండో స్థానాన నిలిచింది. ప్రస్తుత సైకిల్‌లో ఆ జట్టు శ్రీలంకతో మరో టెస్టు, పాకిస్థాన్‌తో రెండు (రెండూ స్వదేశంలోనే) ఆడాల్సి ఉంది. ఈ మూడింటిలో రెండు గెలిస్తే టాప్2లో (ఆస్ట్రేలియా ఫలితాలపై ఇది ఆధారపడి ఉంటుంది) నిలుస్తుంది. ఒకవేళ భారత్.. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని దక్కించుకుని.. స్వదేశంలో శ్రీలంక, ఆస్ట్రేలియాను మట్టికరిపిస్తే అప్పుడు టాప్2 జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనే అవకాశముంది.

### లంకకూ ఓ అవకాశం..

సఫారీలతో తొలి టెస్టు ఓటమి లంక అవకాశాలను దెబ్బతీసినా వాళ్లకింకా తలుపులు మూసుకుపోలేదు. ఆ జట్టు మరో మూడు మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా అందులో రెండు సొంతగడ్డపై ఆడేవే. స్వదేశంలో 1-0తో ఆసీస్‌ను నిలువరించినా ఫైనల్ రేసులో ఉండటానికి చాన్స్ ఉంది.

### ఆసీస్‌కు సంకట స్థితి..

పెర్త్ టెస్టు ఓటమి, సఫారీల భారీ గెలుపుతో ఆస్ట్రేలియా డబ్ల్యూటీసీ ఫైనల్ అవకాశాలు దెబ్బతిన్నాయి. ఈ సైకిల్‌లో కంగారూలు మరో ఆరు మ్యాచ్‌లు (ఇండియాతో 4, శ్రీలంకతో 2) ఆడాల్సి ఉంది. వీటిలో నాలుగు మ్యాచ్‌లు గెలిస్తే ఇతర ఫలితాలతో సంబంధం లేకుండా ఆ జట్టు వరుసగా రెండోసారి ఫైనల్ చేరుతుంది. భారత్‌తో సిరీస్‌ను 32తో కోల్పోయినా శ్రీలంకను 20తో ఓడిస్తే ఆ జట్టు టాప్2లో నిలుస్తుంది.

## శ్రీనిధి బోణీ

**హైదరాబాద్ :** ప్రతిష్ఠాత్మక ఐలీగ్‌లో శ్రీనిధి దక్కన్ అదిరిపోయే బోణీ కొట్టింది. సోమవారం దక్కన్ ఎరీనాలో జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి దక్కన్ ఎఫ్‌సీ 21తో చర్చిల్ బ్రదర్స్‌పై అద్భుత విజయం సాధించింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో శ్రీనిధి తరపున ఫైజల్ షా యెజ్ (23ని), అం జె ల్ ఒర్లీన్(72ని) గోల్స్ చేశారు. లామెగోలెన్ హన్సింగ్ (91ని).. చర్చిల్ బ్రదర్స్‌కు ఏకైక గోల్ అందించాడు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### పుణెలో పీకేఎల్ పోరు

**పుణె:** ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్) మూడో అంచె పోటీలకు పుణె సిద్ధమైంది. ఇప్పటికే హైదరాబాద్, నోయిడా వేదికలుగా మ్యాచ్‌లు ముగియగా, మూడో అంచె పోటీలకు మంగళవారం నుంచి పుణెలో తెరలేవనుంది. ఈనెల 3న మొదలయ్యే పుణె అంచె పోటీలు 29వ తేదీత ముగియనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ పుణెరీ పల్టాన్ సొంతగడ్డపై సత్తాచాటాలన్న పట్టుదలతో ఉంది. మంగళవారం బెంగళూరుగుజరాత్, యూ ముంబాపుణెరీ పల్టాన్ మధ్య మ్యాచ్‌లు జరుగనున్నాయి.



# పుష్ప-2కు సపోర్ట్..

## పవన్ కళ్యాణ్‌కు అల్లు అర్జున్ ధన్యవాదాలు



అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో నటించిన ఫ్రాంచైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్ డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ జీవో చేసింది. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు అల్లు అర్జున్.

ఈ నిర్ణయం తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుంది. ప్రత్యేకించి ఏపీ సీఎం చంద్రబాబుకు, సినీ ఇండస్ట్రీని బలోపేతం చేయడంలో సహకారం అందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ ట్వీట్ చేశాడు బన్నీ. ఇప్పుడీ ట్వీట్ నెట్టింట వైరల్ అవుతోంది.

రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇప్పటికే లాంచ్ చేసిన పుష్ప పుష్ప పుష్ప సాంగ్, సూసేకి, కిస్సిక్, పీలింగ్స్ పాటలు కూడా బ్లాక్ బస్టర్ టాక్‌తో మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాయి.




# పుష్ప-3 కూడా వచ్చేస్తుంది..

## అల్లు అర్జున్ టీం అఫీషియల్ టైటిల్ ఇదే

పాన్ ఇండియా మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేసిన తెలుగు ప్రాజెక్టుల్లో టాప్‌లో ఉంటుంది అల్లు అర్జున్ నటించిన పుష్ప. ఈ చిత్రం సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ టైటిల్ రోల్‌లో ఫ్రాంఛైజీగా వస్తోండగా.. ఇప్పటికే పుష్ప ది రైజ్ బాక్సాఫీస్ వద్ద రికార్డుల మోత మోగించింది. తాజాగా పుష్ప 2 ది రూల్ (Pushpa 2 The Rule) డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇదిలా ఉంటే సీక్వెల్ విడుదలకు ముందే పుష్ప 3పై ఇప్పటికే నెట్టింట వార్తలు రౌండప్ చేస్తున్న విషయం తెలిసిందే. మీరు మీ హీరోను నాకోసం ఇంకో మూడేళ్లు ఇవ్వగలిగే అవకాశముందా..? అని అడగండి. ఉందంటే ఆ తర్వాత పుష్ప 3 చేస్తానంటూ ఇప్పటికే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో కామెంట్స్ చేశాడు సుకుమార్. ఇదిలా ఉంటే ఎవరూ ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చింది బన్నీ టీం. ట్రీక్వెల్ పుష్ప 3 ది ర్యాంపేజ్ టైటిల్‌తో రాబోతుంది. మ్యూజిక్ సిట్టింగ్స్ స్టూడియోలో సుకుమార్ టీం బ్యాక్ డ్రాప్‌లో స్క్రీన్‌పై టైటిల్ లుక్ ఉన్న ఫొటోను షేర్ చేశారు. సీక్వెల్ ఎండింగ్‌లో పుష్ప 3 టీజర్ కూడా ఉండబోతుందని ఇన్‌సైడ్ టాక్. ఇంకేంటి మరి మూవీ లవర్స్‌లో పుష్ప రాజ్ మేనియా మరికొన్నేళ్లపాటు పదిలంగా ఉండబోతున్నట్టు తాజా అప్‌డేట్ క్లారిటీ ఇచ్చేస్తుంది.

# రాజాసాబ్ సందడి షురూ



సూపర్‌స్టార్‌డమ్ ఉన్న హీరోలు హారర్ కామెడీ జానర్‌లో సినిమా చేయడం అరుదు. 'రాజా సాబ్' సినిమాతో ప్రభాస్ ఆ ఫీట్ చేస్తున్నారు. ఇది ప్రభాస్ చేస్తున్న ప్రయోగమే అని చెప్పాలి. నిజానికి ఆయన చేస్తున్నారు కాబట్టే, శంఖంలో పోస్తేనే తీర్థం అన్నట్టుగా 'రాజా సాబ్' పాన్‌ఇండియా సినిమా అయ్యింది. దర్శకుడు మారుతి కెరీర్‌కి ఈ సినిమా కీలకం. అందుకే ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారాయన. రీసెంట్‌గా విడుదల చేసిన సింహాసనంపై కూర్చుకున్న ప్రభాస్ స్టిల్ అభిమానలోకంలో చర్చనీయాంశమైంది.

ఈ సినిమా నుంచే స్టైలిష్‌గా ఉన్న మరో లుక్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. దాంతో ఇందులో ప్రభాస్ డ్యూయెల్ రూల్ చేస్తున్నారా? అనే చర్చ నడుస్తున్నది. ఇక 'రాజా సాబ్' ప్రోగ్రెస్ విషయానికొస్తే.. షూటింగ్ ఈ నెలాఖరుకు పూర్తవ్వబోతున్నదట. క్రిస్మస్ కానుకగా టీజర్‌ని విడుదల చేసే ప్లాన్‌లో మారుతి ఉన్నారని తెలుస్తున్నది. అలాగే సంక్రాంతి కానుకగా ఓ మాస్ బీట్‌ని కూడా ప్రేక్షకుల ముందుకు తెచ్చే యోచనలో మేకర్స్ ఉన్నారట.

నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో సంజయ్‌దత్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. మొత్తానికి 'రాజా సాబ్' ఈ ఏడాది చివరి నుంచి సందడి షురూ చేయనున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక పాన్ ఇండియా సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 10న విడుదల కానుంది.

# సిల్క్‌స్మిత బయోపిక్

స్వర్గీయ నటి, ప్రఖ్యాత నాట్యతార సిల్క్‌స్మిత బయోపిక్ తెరకెక్కించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. 'సిల్క్‌స్మిత – క్వీన్ ఆఫ్ ది సౌత్' అనేది టైటిల్. STRI సినిమాస్ పతాకంపై ఎస్.బి.విజయ్ అమృతరాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జయరామ్ శంకరన్ దర్శకుడు. ఈ అఫీషియల్ బయోపిక్‌లో సిల్క్‌స్మితగా చంద్రిక రవి కనిపించనున్నారు. సిల్క్‌స్మిత పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటనతోపాటు ఓ ప్రత్యేకమైన వీడియోను మేకర్స్ విడుదల చేశారు. బాలీవుడ్ 'డర్టీ పిక్చర్' చిత్రం సిల్క్‌స్మిత బయోపిక్‌గా అప్పట్లో ప్రచారం జరిగింది. ఆమె జీవితానికి సంబంధించిన కొన్ని అంశాలను ఆ సినిమాలో పొందుపరిచడంతో సినిమాపై మంచి హైప్ ఏర్పడి భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు రాబోతున్న 'సిల్క్‌స్మిత – క్వీన్ ఆఫ్ ది సౌత్' చిత్రం సిల్క్ స్మిత అధిరారిక బయోపిక్ కావడం గమనార్హం. వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా షూటింగ్ మొదలుకానుంది.

# నేను చేసిన అతిపెద్ద తప్పు అదే..

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ రీసెంట్‌గా గాయపడిన విషయం తెలిసిందే. అయితే.. ఆమె గాయానికి గల కారణం మాత్రం ఎవరికీ తెలీదు. రీసెంట్‌గా ఈ విషయంపై రకుల్ స్పందించింది. తానెందుకు గాయపడిందో ఓ ఇంటర్వ్యూలో వివరంగా చెప్పింది. 'అది అక్టోబర్ 5. ఎప్పట్లాగే ఉదయం జిమ్‌కి వెళ్లాను. 80 కేజీలు లిఫ్ట్ చేశాను. ఉన్నట్టుండి వెన్నులో నొప్పి మొదలైంది. జిమ్‌లో ఇలాంటి నొప్పులు సహజం. అందుకే పట్టించుకోలేదు. ఇంటికెళ్లి, రెడీ అయ్యి షూటింగ్‌కి వెళ్లిపోయాను. నేను చేసిన అతిపెద్ద తప్పు అదే. షూటింగ్ ముగించుకొని రాత్రి ఇంటికి వచ్చాక, నొప్పి అధికమైంది. వంగలేకపోయాను. చివరకు దుస్తులు కూడా మార్చుకోలేకపోయాను. జిమ్‌కి వెళ్లడం ఆపితే తగ్గిపోతుందిలే అనుకొని నాలుగురోజులు జిమ్‌కి గ్యాప్ ఇచ్చాను. నాలుగోరోజు నడుము కింద భాగం మొద్దుబారిపోయింది. బీపీ కూడా డౌన్ అయ్యింది. ఉన్నట్టుండి స్పృహ కోల్పోయాను. ఇంట్లో వాళ్లు హుటాహుటిన హాస్పిటల్‌కి తీసుకెళ్లారు. నేను ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే.. జిమ్ చేసేవాళ్లు వెన్ను నొప్పిని తేలిగ్గా తీసుకోవద్దు. అది లైఫ్‌నే ప్రమాదంలో పడేసే ఛాన్సుంది. ఏదేమైనా ప్రస్తుతమైతే నా ఆరోగ్యం కుదుటపడింది. నేను బాగానే ఉన్నాను' అంటూ చెప్పుకొచ్చింది రకుల్.






EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com